

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 20-07-2026 | సంపుటి - 29 | సంచిక - 58 | రూ : 4 | పేజీలు: 8


### ఆగస్టు 3 వరకు

# గాంధీభవన్‌కు రావొద్దు

## కొందరు హైదరాబాద్‌లో కూర్చొని సర్‌పై పనిచేయడం లేదు

- అర్హులైనవారి ఓట్లను కాపాడేందుకు పార్టీ నేతలు గట్టిగా పనిచేయాలి
- ఇన్‌ఛార్జి మంత్రులు ఈ కార్యక్రమాన్ని పూర్తిగా పర్యవేక్షించాలి

అన్నింటికీ వారిదే బాధ్యత

- కాంగ్రెస్ శ్రేణులతో జూమ్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, 19 జూలై :** కార్పొరేషన్ ఛైర్మన్, పార్టీ కమిటీల్లో పదవులు కావాలని గాంధీభవన్ చుట్టూ తిరగొద్దని, వాటి కోసం వచ్చే వారికి అపాయింట్‌మెంట్లు కూడా ఇవ్వవద్దని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 'సర్ గడువును ఎన్నికల కమిషన్ వచ్చే నెల 3 వరకు పొడిగించింది. దీనిని ఒక అవకాశంగా తీసుకుని అర్హులైనవారి ఓట్లను కాపాడేందుకు పార్టీ నేతలు గట్టిగా పనిచేయాలి. ఆగస్టు 3 వరకు నాయకులెవరూ గాంధీభవన్‌కు రావద్దు. అందరూ పూర్తిగా క్షేత్రస్థాయిలో ఉండాలి. హైదరాబాద్ చుట్టూ తిరుగుతామంటే కుదరదు. వచ్చే పది రోజులు ఎన్నికల ప్రచారం తరహాలో నియోజకవర్గాల్లో పర్యటించాలి' అని నిర్దేశించారు. సర్‌పై పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, అనుసరించాల్సిన వ్యూహంపై ఆదివారం జూమ్ ద్వారా పార్టీ నేతలతో సీఎం మాట్లాడారు. ''ఈ అంశంపై పార్టీ ఆధ్వర్యంలో మొత్తం 119 నియోజకవర్గాల్లో 489 సమావేశాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో బాగా వెనుకబడిన

తరువాయి 2లో



### సర్‌ను నిర్వీర్యం చేసేందుకు

# కాంగ్రెస్, భారాస, మజ్లిస్ కుట్రలు

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- నిరుద్యోగుల గురించి మాట్లాడే హక్కు భారాసకు లేదు: రామచందర్‌రావు

హైదరాబాద్ : 'నిజమైన ఓటర్లకు హక్కులు కల్పించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియ పవిత్రమైన కార్యక్రమం. రాష్ట్రంలో కాంగ్రెస్, భారాస, మజ్లిస్ పార్టీలు దానిని నిర్వీర్యం చేసేందుకు కుట్రలకు పాల్పడుతున్నాయి' కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ సహకారంతో మజ్లిస్ పార్టీ చాప కింద నీరులా దొంగ ఓట్లను నమోదు చేయించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. దీని కోసం ఉద్యోగులను బెదిరిస్తూ తమకు అనుకూలంగా మలుచుకుంటోందని ధ్వజమెత్తారు. ఆదివారం భాజపా నగర కార్యాలయంలో పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఉదయం సెషన్‌కు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, మధ్యాహ్నం సెషన్‌కు కిషన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

తరువాయి 2లో



# రాజకీయాలు పక్కనబెట్టి నీరు ఎత్తిపోయండి

- రైతులపై ఏమాత్రం గౌరవం ఉన్నా కాళేశ్వరం మోటార్లు ఆన్ చేయాలి
- 'రైతు మహా పాదయాత్ర'లో సీఎంను డిమాండ్ చేసిన హరీశ్‌రావు

చిన్నకోడూరు : 'కేసీఆర్‌పై పగతో సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం నీరు ఎత్తిపోయడంలేదు. ఏకంగా 70 టీఎంసీల

తరువాయి 2లో




### చారిత్రక పర్యటనకు రాష్ట్రపతి..

# తొలిసారిగా మాల్దోవా, నార్త్ మాసిడోనియాకు!

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మూడు దేశాల పర్యటనకు శ్రీకారం
- తొలిసారిగా మాల్దోవా, నార్త్ మెసిడోనియాకు వెళ్లనున్న భారత రాష్ట్రపతి
- మూడు దశాబ్దాల తర్వాత రొమేనియాలో ముర్ము పర్యటన
- వాణిజ్యం, పెట్టుబడులే ప్రధాన అజెండాగా ఈ చారిత్రక యాత్ర

2లో



# పీవీ సింధు చారిత్రక టైటిల్ విజయం...

### అభినందించిన చంద్రబాబు, లోకేశ్

- జపాన్ ఓపెన్ టైటిల్ గెలుచుకున్న పీవీ సింధు
- ఫైనల్లో యమగుచిపై 21-17, 21-17 తేడాతో గెలుపు
- ఈ ఘనత సాధించిన తొలి భారత షట్లర్‌గా రికార్డు
- సింధుకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

2లో

### అర్జెంటీనా అటాకింగా? స్పెయిన్ డిఫెన్స్ మంత్రమా?

# ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్

## ఫిఫా ప్రపంచకప్ 2026 ఫైనల్లో అర్జెంటీనా, స్పెయిన్ అమీతుమీ



- వరుసగా రెండోసారి కప్పు గెలవాలని చూస్తున్న మెస్సీ సేన
- 16 ఏళ్ల నిరీక్షణకు తెరదించి రెండో టైటిల్ కొట్టాలని స్పెయిన్ పట్టుదల
- అందరి దృష్టి 39 ఏళ్ల మెస్సీ, 19 ఏళ్ల యువ సంచలనం యమాల్‌పైనే
- అర్జెంటీనా అటాకింగ్ వర్సెస్ స్పెయిన్ డిఫెన్స్ మధ్య ఆసక్తికర పోరు

2లో



# అట్లాంటిక్ మహాసముద్రంలో 'గుర్రాల దీవి'

### శాంసంగ్ కీలక నిర్ణయం..

# అమెరికాలో ఉద్యోగాల కోత



- న్యూజెర్సీ నుంచి టెక్సాస్‌కు మారనున్న ప్రధాన కార్యాలయం
- 739 మంది ఉద్యోగులపై ప్రభావం, కొందరికి తొలగింపు
- ఏఐ చిప్‌ల వ్యాపారం జోరుగా ఉన్నా, మొబైల్ విభాగం నష్టాల్లోకి
- టెక్నాలజీ మార్పులకు అనుగుణంగా సంస్థాగత మార్పులని వెల్లడి

# ఆగస్టు 3 వరకు గాంధీభవన్‌కు రావొద్దు

హైదరాబాద్: కార్పొరేషన్ ఛైర్మన్, పార్టీ కమిటీల్లో పదవులు కావాలని గాంధీభవన్ చుట్టూ తిరగొద్దని, వాటి కోసం వచ్చే వారికి అపాయింట్‌మెంట్లు కూడా ఇవ్వవద్దని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 'సర్ గడువును ఎన్నికల కమిషన్ వచ్చే నెల 3 వరకు పొడిగించింది. దీనిని ఒక అవకాశంగా తీసుకుని అర్హులైనవారి ఓట్లను కాపాడేందుకు పార్టీ నేతలు గట్టిగా పనిచేయాలి. ఆగస్టు 3 వరకు నాయకులెవరూ గాంధీభవన్‌కు రావద్దు. అందరూ పూర్తిగా క్షేత్రస్థాయిలో ఉండాలి. హైదరాబాద్ చుట్టూ తిరుగుతామంటే కుదరదు. వచ్చే పది రోజులు ఎన్నికల ప్రచారం తరహాలో నియోజకవర్గాల్లో పర్యటించాలి' అని నిర్దేశించారు. సర్‌పై పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, అనుసరించాల్సిన వ్యూహంపై ఆదివారం జూమ్ ద్వారా పార్టీ నేతలతో సీఎం మాట్లాడారు. "ఈ అంశంపై పార్టీ ఆధ్వర్యంలో మొత్తం 119 నియోజకవర్గాల్లో 489 సమావేశాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో బాగా వెనుకబడిన నియోజకవర్గాల్లో ఇప్పటికైనా నేతలు స్పందించాలి. కొందరు నాయకులు హైదరాబాద్‌లో కూర్చొంటున్నారు. క్షేత్ర స్థాయికి వెళ్లి పనిచేయడం లేదు. సోమవారం పదిమంది ఇన్‌ఛార్జి మంత్రులు వారివారి జిల్లాల్లో సర్‌పై సమీక్ష నిర్వహిస్తారు. ఎంపీలు పార్లమెంట్ సమావేశాల్లో ఉన్నా కూడా ఎప్పటికప్పుడు సమీక్షలు జరపాలి. ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న చోట వారు పనిచేయకపోతే కఠినంగా వ్యవహరిస్తాం. సర్‌పై పర్యవేక్షణకు కాంగ్రెస్ ఇన్‌ఛార్జిగా ఉన్న వారు ఎప్పటికప్పుడు కిందిస్థాయి నేతలతో సమన్వయం చేసుకోవాలి.

**30న మళ్లీ పూర్తి స్థాయి సమీక్ష**

ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, కార్పొరేషన్ ఛైర్మన్లు.. బీఎల్ఏల నివేదికలను పరిశీలించాలి. కేవలం బీఎల్‌వో నివేదిక మీద మాత్రమే ఆధారపడితే కఠిన చర్యలు ఉంటాయి. బీఎల్ఏలను నాయకులు సమర్థంగా ఉపయోగించుకోవాలి. బీఎల్ఏలు, బీఎల్‌వోల నివేదికలను గాంధీభవన్‌లో ఏర్పాటుచేసిన బృందం ఎప్పటికప్పుడు పరిశీలించాలి. ఇన్‌ఛార్జి మంత్రులు వారివారి జిల్లాల్లో సర్ తీరును పూర్తిగా పర్యవేక్షించాల్సిందే. అన్నింటికీ వారిదే బాధ్యత. ఈ నెల 30న మళ్లీ పూర్తి స్థాయి సమీక్ష నిర్వహిస్తాం. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు తీసుకుంటాం. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరింత బాధ్యత తీసుకుని మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌ఛార్జులతో మాట్లాడాలి. ప్రతి ఒక్కరూ సీరియస్‌గా దృష్టిసారించాలి" అని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

**చిన్న నిర్లక్ష్యాన్ని కూడా సహించేది లేదు**

మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. "సర్ ప్రక్రియ పార్టీకి చాలా కీలకమైనది. చిన్న నిర్లక్ష్యాన్ని కూడా సహించేది లేదు. నాయకులందరూ వారివారి నియోజకవర్గాలలో దీనిపైనే ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు.. బీఎల్ఏలకు సహకారం అందించాలి. ఇతర రాష్ట్రాలలో సర్ వల్ల జరిగిన నష్టాలను గుర్తించి ఇక్కడ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా నష్టపోవద్దు. బాగా పనిచేసే 100 మంది బీఎల్ఏలకు రాహుల్ గాంధీని కలిసి ఫొటో దిగే అవకాశం కల్పిస్తాం" అని చెప్పారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, సమన్వయకర్తలు జూమ్ సమావేశంలో పాల్గొన్నారు.

* **'ఫిఫా'లో ఒక విజన్ ఉంది: సీఎం రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్: ఫిఫా ప్రపంచ కప్‌కు మద్దతు ఇవ్వడం వెనుక లోతైన ఉద్దేశం, ఒక విజన్ ఉందని ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పేర్కొన్నారు. "ఎప్పటికైనా భారత ఫుట్‌బాల్ జట్టు వరల్డ్ కప్ ఫైనల్స్ ఆడటమే కాకుండా, దానికి ఆతిథ్యం కూడా ఇస్తుందని నేను బలంగా నమ్ముతున్నా. ఆ ఫుట్‌బాల్ జట్టులో భవిష్యత్తు ఆటగాళ్లలో తెలంగాణ నుంచే చాలామంది ఉంటారు. నేను క్రీడలను, ముఖ్యంగా ఫుట్‌బాల్‌ను ప్రాణంగా ప్రేమిస్తా" అని తెలిపారు.

# సర్‌ను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్, భారాస, మజ్లిస్ కుట్రలు

హైదరాబాద్ : 'నిజమైన ఓటర్లకు హక్కులు కల్పించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియ పవిత్రమైన కార్యక్రమం. రాష్ట్రంలో కాంగ్రెస్, భారాస, మజ్లిస్ పార్టీలు దానిని నిర్వీర్యం చేసేందుకు కుట్రలకు పాల్పడుతున్నాయి' కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ సహకారంతో మజ్లిస్ పార్టీ చాప కింద నీరులా దొంగ ఓట్లను నమోదు చేయించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. దీని కోసం ఉద్యోగులను బెదిరిస్తూ తమకు అనుకూలంగా మలుచుకుంటోందని ధ్వజమెత్తారు. ఆదివారం భాజపా నగర కార్యాలయంలో పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఉదయం సెషన్‌కు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు, మధ్యాహ్నం సెషన్‌కు కిషన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రేటర్‌లో నివసిస్తున్న ఇతర ప్రాంతాల వారు ఇక్కడే ఓటు నమోదు చేసుకోండి. "మజ్లిస్ కుట్రలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారు. ఈ కుట్రలకు భాగ్యనగర ప్రజలు అడ్డుకట్ట వేయాలి. ఇప్పటికే భాగ్యనగరంలో మజ్లిస్ పార్టీ ప్రాబల్యం పెరిగిపోయింది. రాష్ట్రంలో భవిష్యత్తులో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు మజ్లిస్ దీర్ఘకాల ప్రణాళికలను అమలుచేస్తోంది. దీని కోసం కాంగ్రెస్, భారాసలను వాడుకుంటోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రేటర్‌లో నివసిస్తున్న ఇతర ప్రాంతాల ప్రజలు హైదరాబాద్‌లోనే తమ ఓటును నమోదు చేసుకుని మజ్లిస్ పార్టీ నుంచి హైదరాబాద్‌ను రక్షించాలి. మజ్లిస్ పార్టీకి కాంగ్రెస్, భారాసలు లెఫ్ట్ హ్యాండ్, రైట్ హ్యాండ్. జీహెచ్ఎంసీని ఆ పార్టీకి కట్టబెట్టేందుకు కాంగ్రెస్, భారాసలు పావులు కదుపుతున్నాయి" అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు.

# రాజకీయాలు పక్కనబెట్టి నీరు ఎత్తిపోయండి

చిన్నకోడూరు : 'కేసీఆర్‌పై పగతో సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం నీరు ఎత్తిపోయడంలేదు. ఏకంగా 70 టీఎంసీల నీటిని కిందికి వదిలిపెట్టారు. ఆ నీటిని ఏపీ సీఎం చంద్రబాబు పట్టిసీమ మోటార్లు ఆన్ చేసి ఒడిసి పట్టుకున్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డికి రైతులపై ఏ మాత్రం ప్రేమ, గౌరవం ఉన్నా రాజకీయాలు పక్కన పెట్టి మోటార్లు ఆన్ చేసి నీటిని ఎత్తిపోయాలి' అని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాళేశ్వరం జలాలు ఎత్తిపోయాలని డిమాండ్ చేస్తూ.. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని అనంతగిరి జలాశయం(అల్లీపూర్ ఎల్లమ్మగుడి) నుంచి రంగనాయకసాగర్ వరకు 16 కి.మీ. మేర భారాస నాయకులు, రైతులు ఆదివారం 'రైతు మహా పాదయాత్ర' చేపట్టారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌తో కలిసి హరీశ్‌రావు చివర్లో కిలోమీటరున్నర పాదయాత్ర చేసి రంగనాయక్‌సాగర్‌పై రైతులనుద్దేశించి మాట్లాడారు. "రూ.35 వేల కోట్ల రుణమాఫీ చేస్తానని రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పి కేవలం రూ.12 వేల కోట్లు మాత్రమే చేశారు. మూడు పంటలకు ఇవ్వాల్సిన రూ.19 వేల కోట్లు రైతుబంధు ఇవ్వలేదు. ఎరువులకు యాప్ పెట్టి రైతుల ఉసురు పోసుకుంటున్నారు. రేవంత్‌రెడ్డి దళారులు, రైస్‌మిల్లర్ల చేతుల్లో తోలు బొమ్మ అయ్యారు.

**దేవుళ్లపై ఒట్టుపెట్టి తప్పినందుకే కరవు..**

రైతులకు రుణమాఫీ చేస్తానని భద్రాద్రి రాముడు, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి, కొమురవెల్లి మల్లన్న, జహంగీర్ పీర్ దర్గా, మెదక్ చర్చి, ఏడుపాయల అమ్మవారిపై ఒట్టు పెట్టి మాట తప్పారు. కాంగ్రెస్ పార్టీ నేతలు దేవుళ్లపై ఒట్టు పెట్టి మాట తప్పడం వల్ల మళ్లీ కరవు వచ్చింది. ఎల్లంపల్లిలో నీరు లేకపోతే హైదరాబాద్‌కు మంచి నీరు సరఫరా ఉండదు. కరవులో మీట నొక్కకపోతే తాగునీరందక ప్రజలు ఆగమవుతారని విశ్రాంత ఇంజినీర్లు సీఎంకి సూచిస్తే జైల్లో పెడతా, బెల్టుతో కొడతా అంటూ బెదిరించారు.

# చారిత్రక పర్యటనకు రాష్ట్రపతి..

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వారం రోజుల విదేశీ పర్యటనకు ఆదివారం బయల్దేరారు. తూర్పు ఐరోపాలోని మాల్డోవా, నార్త్ మాసిడోనియా, రొమేనియా దేశాల్లో ఆమె పర్యటించనున్నారు. భారత రాష్ట్రపతి మాల్డోవా, నార్త్ మాసిడోనియాలకు వెళ్లడం ఇదే తొలిసారి కావడం ఈ పర్యటనకు చారిత్రక ప్రాధాన్యాన్ని ఇచ్చింది. అలాగే, మూడు దశాబ్దాల తర్వాత భారత రాష్ట్రపతి రొమేనియాలో పర్యటించనున్నారు. జులై 19 నుంచి 25 వరకు సాగే ఈ పర్యటనలో భాగంగా మూడు దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారిస్తారు. వాణిజ్యం, పెట్టుబడులు, టెక్నాలజీ, వ్యవసాయం, విద్య, వైద్య ఆరోగ్య రంగాల్లో సహకారాన్ని పెంచుకోవడమే లక్ష్యంగా చర్చలు జరుపుతారు. పర్యటన తొలి అంకంలో మాల్డోవా అధ్యక్షురాలు మైయా సాండు ఆహ్వానం మేరకు ఆ దేశంలో పర్యటిస్తారు. అనంతరం నార్త్ మాసిడోనియాకు వెళతారు. ఈ రెండు దేశాల్లోని అధ్యక్షులు, పార్లమెంట్ స్పీకర్లతో రాష్ట్రపతి ముర్ము సమావేశమవుతారు. అక్కడి వ్యాపార ఫోరమ్‌లలో ప్రసంగించడంతో పాటు ప్రవాస భారతీయులతోనూ భేటీ అవుతారు. పర్యటన చివరి అంకంలో భాగంగా జులై 23 నుంచి 25 వరకు రొమేనియాలో పర్యటిస్తారు. ఈ పర్యటనతో ఆయా దేశాలతో భారత సంబంధాలకు కొత్త ఊపు వస్తుందని విదేశాంగ శాఖ ఆశాభావం వ్యక్తం చేసింది. పెట్టుబడి అవకాశాలను పరిశీలించేందుకు రాష్ట్రపతి వెంట ఉన్నతస్థాయి వ్యాపార ప్రతినిధి బృందం కూడా ఈ పర్యటనలో పాల్గొంటోంది.

# అర్జెంటీనా అటాకింగా? స్పెయిన్ డిఫెన్స్ మంత్రమా?

## ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్

ఫుట్‌బాల్ అభిమానులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న అతిపెద్ద ఫిఫా ప్రపంచకప్ 2026 తుది అంకానికి చేరుకుంది. న్యూయార్క్‌లోని మెట్‌లైఫ్ స్టేడియం వేదికగా ఈ అర్ధరాత్రి 12.30 గంటలకు ప్రారంభం కానున్న ఫైనల్ సమరంలో... అర్జెంటీనా, స్పెయిన్ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న అర్జెంటీనా వరుసగా రెండోసారి టైటిల్ గెలిచి చరిత్ర సృష్టించాలని చూస్తుండగా, 16 ఏళ్ల నిరీక్షణకు తెరదించి రెండోసారి ప్రపంచ విజేతగా నిలవాలని స్పెయిన్ పట్టుదలగా ఉంది. ఈ తుది పోరులో అందరి కళ్లూ అర్జెంటీనా కెప్టెన్, ఫుట్‌బాల్ మాంత్రికుడు లియోనల్ మెస్సీపైనే ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం ఖతార్‌లో ఫ్రాన్స్‌పై అర్జెంటీనాకు కప్పు అందించి చరిత్ర సృష్టించిన మెస్సీ, అదే మ్యాజిక్‌ను పునరావృతం చేయాలని ఉవ్విళ్లూరుతున్నాడు. 39 ఏళ్ల వయసులో, బహుశా తన కెరీర్‌లో ఇదే ఆఖరి ప్రపంచకప్ ఆడుతున్న మెస్సీ, ఈ టోర్నీలోనూ అద్భుత ఫామ్‌తో జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. ఇప్పటివరకు 8 గోల్స్, 4 కీలక అసిస్ట్‌లతో జట్టును అజేయంగా ఫైనల్‌కు చేర్చాడు. 1962లో బ్రెజిల్ తర్వాత వరుసగా రెండు ప్రపంచకప్‌లు గెలిచిన జట్టుగా అర్జెంటీనాను నిలబెట్టి, తన కెరీర్‌కు ఘనమైన వీడ్కోలు పలకాలని మెస్సీ భావిస్తున్నాడు. అయితే, మెస్సీ కలను అడ్డుకోవడానికి స్పెయిన్ యువ సంచలనం, 19 ఏళ్ల లామిన్ యమాల్ సిద్ధంగా ఉన్నాడు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, 2007లో మెస్సీ ఒక పసికందుగా ఉన్న యమాల్‌ను చేతుల్లోకి తీసుకుని ఫొటో దిగాడు. అప్పుడు తాను ఎత్తుకున్న పిల్లాడే, ఇప్పుడు ప్రపంచకప్ ఫైనల్ ప్రత్యర్థిగా నిలుస్తాడని బహుశా ఊహించి ఉండడు. యమాల్‌తో పాటు ఉక్కుగోడ లాంటి స్పెయిన్ డిఫెన్స్ కూడా అర్జెంటీనాకు పెద్ద సవాల్ అని చెప్పొచ్చు. రోడ్రి నేతృత్వంలోని స్పెయిన్, ఈ టోర్నీలో ప్రత్యర్థులకు అతి తక్కువ అవకాశాలు ఇచ్చింది. ఇప్పటివరకు కేవలం ఒకే ఒక్క గోల్ సమర్పించుకుందంటే వారి రక్షణ శ్రేణి ఎంత దుర్భేద్యంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ టోర్నీ ఆరంభం నుంచి స్పెయిన్ జట్టు సమష్టిగా రాణిస్తోంది. మైకెల్ ఒయార్జాబల్ 5 గోల్స్‌తో జట్టు టాప్ స్కోరర్‌గా నిలవగా, కెప్టెన్ రోడ్రి మిడ్‌ఫీల్డ్‌ను తన నియంత్రణలో ఉంచుతున్నాడు. యమాల్ తన వేగంతో ప్రత్యర్థులను ముప్పుతిప్పలు పెడుతున్నాడు. 2010లో చివరిసారి కప్పు గెలిచిన స్పెయిన్, ఈసారి గెలిచి తమ ఖాతాలో రెండో ఫిఫా టైటిల్ వేసుకోవాలని పట్టుదలగా ఉంది. ఈ ఫైనల్ రెండు విభిన్నమైన ఆట శైలుల మధ్య పోరుగా కూడా నిలవనుంది. స్పెయిన్ కోచ్ లూయిస్ డి ఫ్లుయెంటె జట్టు, బంతిని తమ ఆధీనంలో ఉంచుకుంటూ ఆడే 'టికీటకా' శైలికి మరిన్ని దాడులు జోడించి ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెడుతోంది. మరోవైపు, కోచ్ లియోనల్ స్కలోని నేతృత్వంలోని అర్జెంటీనా జట్టు, నిరంతర దాడులతో, ప్రత్యర్థి డిఫెన్స్‌ను ఛేదిస్తూ దూకుడుగా ఆడుతోంది.

**మ్యాచ్ వివరాలు**

తేదీ మరియు సమయం: భారత కాలమానం ప్రకారం జులై 19 అర్ధరాత్రి 12:30 గంటలకు
వేదిక: మెట్‌లైఫ్ స్టేడియం, న్యూయార్క్
రిఫరీ: స్లావ్‌కో విన్‌సిచ్
లైవ్ స్ట్రీమింగ్: జీ5 యాప్ మరియు వెబ్‌సైట్‌లో వివిధ భాషల్లో వీక్షించవచ్చు. యునైటెడ్ 8 స్పోర్ట్స్ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం అవుతుంది.

**రెండు జట్ల వివరాలు:**

స్పెయిన్ జట్టు:
గోల్‌కీపర్లు: ఉనై సైమన్, డేవిడ్ రాయా, జోన్ గార్సియా
డిఫెండర్లు: పెడ్రో పోరో, మార్కోస్ లోరెంటె, ఐమెరిక్ లాపోర్టే, పావ్ క్యూబార్సీ, మార్క్ ప్యూబిల్, ఎరిక్ గార్సియా, మార్క్ కుకురెల్లా, అలెగ్జాండ్రో గ్రిమాల్డో
మిడ్‌ఫీల్డర్లు: రోడ్రిగో హెర్నాండెజ్, మార్టిన్ జుబిమెండి, పెడ్రి గొంజాలెజ్, ఫాబియన్ రూయిజ్, మైకెల్ మెరినో, పాబ్లో పేజ్ 'గావి', అలెక్స్ బయేనా
ఫార్వర్డ్స్: మైకెల్ ఒయార్జాబల్, లామిన్ యమాల్, ఫెర్రాన్ టోర్రెస్, బోర్జా ఇగ్లేసియాస్, డాని ఓల్మో, విక్టర్ మునోజ్, నికో విలియమ్స్, యెరెమీ పిన్

**అర్జెంటీనా జట్టు:**

* గోల్‌కీపర్లు: ఎమిలియానో మార్టినెజ్, గెరోనిమో రుల్లీ, జువాన్ ముసో
* డిఫెండర్లు: నహుయెల్ మోలినా, గొంజానో మాంటియెల్, క్రిస్టియన్ రొమెరో, లియోనార్డో బలేర్డి, నికోలస్ ఒటమెండి, లిసాండ్రో మార్టినెజ్, నికోలస్ ట్యాగ్లియాఫికో, ఫకుండో మదీనా
* మిడ్‌ఫీల్డర్లు: లియాండ్రో పరెడెస్, అలెక్సిస్ మాక్ అలిస్టర్, రోడ్రిగో డి పాల్, జియోవాని లో సెల్సో, ఎక్సెక్యెల్ పలాసియోస్, ఎంజో ఫెర్నాండెజ్, వాలెంటిన్ బార్కో
* ఫార్వర్డ్స్: లియోనల్ మెస్సీ, జూలియన్ అల్వారెజ్, లౌటారో మార్టినెజ్, థియాగో అల్మాడా, నికోలస్ పాజ్, నికోలస్ గొంజాలెజ్, గియులియానో సిమియోన్, జోస్ మాన్యువల్ లోపెజ్

# అట్లాంటిక్ మహాసముద్రంలో 'గుర్రాల దీవి'



కెనడాలోని నోవా స్కోటియాకు ఆగ్నేయంగా 300 కిలోమీటర్ల దూరంలో అట్లాంటిక్ మహాసముద్రంలో ఓ వింతైన ప్రపంచం ఉంది. దాని పేరు సేబుల్ ఐలాండ్. ఇక్కడ మనుషుల జనాభా సున్నా. రోడ్లు లేవు, నివాసాలు లేవు. కానీ, దాదాపు 500 అడవి గుర్రాలు స్వేచ్ఛగా తిరుగుతూ జీవిస్తున్నాయి. ఇది కేవలం ఇసుకతో ఏర్పడిన ఓ సన్నని చంద్రవంక ఆకారపు ద్వీపం. సుమారు 42 కిలోమీటర్ల పొడవు, 1.5 కిలోమీటర్ల కంటే తక్కువ వెడల్పుతో ఉండే ఈ ప్రాంతం నిరంతరం గాలులు, తుపానుల తాకిడికి తన రూపాన్ని మార్చుకుంటూ ఉంటుంది. తరచూ మారే ఇసుక దిబ్బలు, దట్టమైన పొగమంచు, భయంకరమైన వాతావరణం కారణంగా ఈ ప్రాంతంలో 350కి పైగా చారిత్రక నౌకలు మునిగిపోయాయి. అందుకే దీనికి 'గ్రేవ్ యార్డ్ ఆఫ్ ది అట్లాంటిక్' (అట్లాంటిక్ స్మశానవాటిక) అనే పేరుంది. ఇంతటి ప్రమాదకరమైన ప్రదేశంలో వందల ఏళ్లుగా అడవి గుర్రాలు మనుగడ సాగిస్తుండటం ఓ అద్భుతం. 18వ శతాబ్దంలో వలసవాదులు కొన్ని గుర్రాలను ఇక్కడికి తీసుకొచ్చి వదిలేశారని, అవే నేటి తరానికి మూలాలని చరిత్రకారులు భావిస్తున్నారు. ఈ ద్వీపానికి ప్రధాన ఆకర్షణ ఇక్కడి అడవి గుర్రాలే. వీటికి ఎలాంటి వైద్య సంరక్షణ గానీ, ఆహారం అందించడం గానీ జరగదు. ఇవి పూర్తిగా ప్రకృతిపైనే ఆధారపడి జీవిస్తాయి. ద్వీపంలోని గడ్డి, మంచినీటి చెరువులే వీటికి ఆధారం. ఇక్కడి కఠిన వాతావరణానికి అలవాటుపడిన ఈ గుర్రాలు పొట్టిగా, దృఢంగా, దట్టమైన వెంట్రుకలతో ఉంటాయి. వీటి మనుగడ, జన్యువులు, ప్రవర్తనపై శాస్త్రవేత్తలు అధ్యయనాలు చేస్తున్నారు. ఈ గుర్రాలను చట్టపరంగా సంరక్షిస్తున్నారు. గుర్రాలే కాకుండా, సేబుల్ ఐలాండ్ అనేక ఇతర జీవరాశులకు స్వర్గధామం. ప్రపంచంలోనే అతిపెద్ద గ్రే సీల్స్ సంతానోత్పత్తి కేంద్రాలలో ఇది ఒకటి. ప్రతి ఏటా ఇక్కడ వేలాది సీల్ పిల్లలు జన్మిస్తాయి. వీటితో పాటు హార్బర్ సీల్స్, తిమింగలాలు, డాల్ఫిన్లు, అట్లాంటిక్ ఫ్లైవే మీదుగా ప్రయాణించే వలస పక్షులకు ఇది ఒక ముఖ్యమైన విడిది కేంద్రం. పర్యావరణపరంగా అత్యంత సున్నితమైన ఈ ద్వీపాన్ని కెనడా ప్రభుత్వం 'సేబుల్ ఐలాండ్ నేషనల్ పార్క్ రిజర్వ్'గా ప్రకటించి, ప్రజల ప్రవేశాన్ని కఠినంగా నియంత్రిస్తోంది. వాతావరణ మార్పుల ప్రభావం, తీరప్రాంత కోత, జంతువుల మనుగడ వంటి అంశాలపై అధ్యయనం చేసేందుకు ఇది ఒక సహజ ప్రయోగశాలగా ఉపయోగపడుతుంది. మానవ ప్రమేయం లేని ఈ అద్భుత ప్రపంచాన్ని వీలైనంత సహజంగా కాపాడటమే ప్రభుత్వ లక్ష్యం.

# శాంసంగ్ కీలక నిర్ణయం.. అమెరికాలో ఉద్యోగాల కోత

ప్రముఖ టెక్నాలజీ దిగ్గజం శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ అమెరికాలో తన కార్యకలాపాలను పునర్‌వ్యవస్థీకరించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. న్యూజెర్సీలోని తన శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ అమెరికా (ఎస్ఈఏ) ప్రధాన కార్యాలయాన్ని టెక్సాస్‌కు తరలించడంతో పాటు, పెద్ద ఎత్తున ఉద్యోగాల కోతను ప్రకటించింది. ఈ మార్పుల వల్ల వందలాది మంది ఉద్యోగులపై ప్రభావం పడనుంది. ప్రధాన కార్యాలయాన్ని న్యూజెర్సీలోని ఎంగిల్‌వుడ్ క్లిఫ్స్ నుంచి టెక్సాస్‌లోని ప్లానోకు తరలించే ప్రక్రియలో భాగంగా 739 ఉద్యోగాలపై ప్రభావం పడుతుందని శాంసంగ్ ధృవీకరించింది. వీరిలో ఎక్కువ మందికి టెక్సాస్‌కు మారేందుకు అవకాశం కల్పించగా, ఆసక్తి చూపని వారిని విధుల నుంచి తొలగించారు. దీనికి అదనంగా, టెక్సాస్‌లోని ప్లానో కార్యాలయంలో మొబైల్ విభాగంతో సహా సుమారు 100 మంది ఉద్యోగులను కూడా తొలగించినట్లు కంపెనీ అంతర్గత పత్రాల ద్వారా వెల్లడైంది. జూన్ 30న సంస్థ వ్యాప్తంగా ఉద్యోగాల కోత ఉంటుందని ఉద్యోగులకు సమాచారం అందినట్లు తెలుస్తోంది. గత కొన్ని వారాలుగా 30 మందికి పైగా సీనియర్ సేల్స్, మార్కెటింగ్ సిబ్బంది తాము కంపెనీని వీడుతున్నట్లు లింక్డ్‌ఇన్‌లో పోస్టులు పెట్టారు. ఈ మార్పులపై శాంసంగ్ స్పందిస్తూ, "వివిధ బృందాలను ఒకేచోటికి తీసుకురావడం ద్వారా సంస్థాగత సామర్థ్యాన్ని పెంచేందుకు, మెరుగైన సహకార వాతావరణాన్ని సృష్టించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం. వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ, ఏఐ ఎకోసిస్టమ్‌లో భాగం కావాలనే లక్ష్యంతోనే టెక్సాస్‌కు మారుతున్నాం," అని వివరించింది. ఇది ప్రపంచవ్యాప్త పునర్‌వ్యవస్థీకరణ కాదని, కేవలం అమెరికాలోని కార్యకలాపాలను ప్రస్తుత వ్యాపార ప్రాధాన్యతలకు అనుగుణంగా మార్చడమేనని స్పష్టం చేసింది. ఈ నిర్ణయం వెనుక శాంసంగ్ వివిధ విభాగాల్లోని పనితీరులో ఉన్న వ్యత్యాసమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఒకవైపు ఏఐ ఆధారిత డిమాండ్‌తో సెమీకండక్టర్ (చిప్) వ్యాపారం అద్భుతమైన లాభాలతో దూసుకుపోతుండగా, మరోవైపు యాపిల్, చైనా కంపెనీల నుంచి తీవ్రమైన పోటీ కారణంగా మొబైల్ విభాగం చరిత్రలో తొలిసారిగా నష్టాలను నమోదు చేయవచ్చని అంచనా వేస్తున్నారు. ఏఐ బూమ్ వల్ల చిప్‌ల ధరలు పెరగడం కూడా టీవీలు, గృహోపకరణాల వంటి కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ విభాగం లాభాలపై ఒత్తిడి పెంచుతోంది. 2026 చివరి నాటికి ప్రధాన కార్యాలయ తరలింపు ప్రక్రియ పూర్తికానుంది. టెక్సాస్‌లో శాంసంగ్‌కు ఇప్పటికే చిప్ ఫ్యాక్టరీలు, మొబైల్ హబ్ ఉన్నాయి. మైక్రోసాఫ్ట్, అమెజాన్, టెస్లా వంటి ఇతర టెక్ కంపెనీలు కూడా తమ కార్యకలాపాలను టెక్సాస్‌కు తరలించడం లేదా ఏఐ వైపు దృష్టి సారించడం వంటి ట్రెండ్‌కు అనుగుణంగానే శాంసంగ్ ఈ చర్యలు తీసుకుంది.

# అక్రమ ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్ల పట్టివేత



ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం డివిజన్లోని ఇందన్ పెల్లి, భర్తన్ పేట్ సెక్షన్లలో అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లు అందిన నమ్మదగిన సమాచారం మేరకు అటవీశాఖ సిబ్బంది దాడులు నిర్వహించి అక్రమ ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. పట్టుకున్న ట్రాక్టర్లను అటవీ శాఖ ఆధీనంలో ఉంచి, సంబంధిత నిబంధనల మేరకు కేసు నమోదు చేసినట్లు ఇంధన్ పల్లి రేంజ్ అధికారి గోదారి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ అడవులలో అక్రమంగా ఇసుక తవ్వడం, అక్రమంగా ఇసుకను రవాణా చేయడం వంటి నేరాలు చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని గ్రామాల అభివృద్ధి పనుల కోసం అనుమతి పొందిన ఇసుక రీచ్ ల నుండి తెచ్చుకోవాలని సూచించారు. అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం నుండి డబ్బులు వస్తున్న కూడా కొందరు తమ స్వలాభం కోసం అడవుల నుండి , ఏకో సెన్సిటివ్ జోన్ల నుండి అక్రమంగా ఇసుక తవ్వి రవాణా చేస్తున్నారని, దీనివలన భూగర్భ జలాలకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ప్రజలందరూ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని అటవీ శాఖ వారికి సహకరించాలని కోరారు. ఈ దాడులలో డిఆర్ఓ విజయ్ కుమార్, ఎఫ్ ఎస్ ఓ లు హనుమంతరావు, శేషరామ్, ఎఫ్ బి ఓ లు మక్బూల్,స్వామి,పోచయ్య, బేస్ క్యాంపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసి మహిళలపై దాడి చేసిన అటవీ అధికారులను సస్పెండ్ చేయాలి

*** లావుడ్యా సత్యనారాయణ నాయక్ డిమాండ్**



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం, మనుబోతులపాడు పంచాయతీ లో గల వేములూరు గ్రామంలో పోడు భూముల సాగులో ఉన్న ఆదివాసీలపై అటవీ అధికారులు జరిపిన దాడులు, దౌర్జన్యం అత్యంత బాధాకరమని బిఆర్ఎస్ సుజాతనగర్ మండల అధ్యక్షులు లావుడ్యా సత్యనారాయణ నాయక్ తీవ్రంగా ఖండించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా ఆదివాసీలు సాగు చేసుకుంటున్న దాదాపు 35 హెక్టార్ల పోడు భూమిని అటవీ అధికారులు బలవంతంగా లాక్కునే ప్రయత్నం చేయడం అన్యాయమని , ఫారెస్ట్ అధికారుల విచక్షణ రహితంగా మహిళా రైతులపై దాడి చేయటం అన్యాయంతో పాటు ఆరుగురు ఆదివాసి మహిళలకు తీవ్ర గాయాలయ్యాయని, మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తూ భయభ్రాంతులకు గురిచేసిన అటవీశాఖ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బాధ్యులైన అధికారులపై క్రిమినల్ , అత్యాచార కేసులు నమోదు చేయాలన్నారు.ఆదివాసుల భూములను లాక్కోవాలని చూస్తే బిఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని , ఆదివాసీలకు ఎక్కడ అన్యాయం జరిగిన బిఆర్ఎస్ పార్టీ వారికి అండగా నిలుస్తుంది ఆయన అంటూ ఆదివాసీలకు అన్యాయం జరిగితే ఊరుకోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన




ప్రజాస్ఫూర్తి, కూకట్ పల్లి : కూకట్ పల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, ప్రతిమ హాస్పిటల్ (కేపీహెచ్‌బీ కాలనీ) వారి సౌజన్యంతో ఆదివారం వివేక్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320డి జిల్లా గవర్నర్ డాక్టర్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూకట్ పల్లి ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం లయన్స్ క్లబ్ చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని అన్నారు. ప్రజలు ఇటువంటి ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యంపై మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. శిబిరంలో ప్రజలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు సూపర్ స్పెషాలిటీ వైద్యులచే వైద్య సేవలు అందించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, క్లబ్ సభ్యులు చెంచు రామిరెడ్డి, శేఖర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ 320డి క్యాబినెట్ సభ్యులు కోటిరెడ్డి, ప్రఫుల్లారెడ్డి, వివేక్ నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్యపాగ శ్రీనివాస్, అసోసియేషన్ సభ్యులు రవీందర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన మహిళ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానం

*** గిరిజన మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఉమాదేవి**

ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ లోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 202627 విద్య సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రత్యేక దశ ప్రవేశాల కోసం ఈ నేల 2026 తేదీల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి. ఉమాదేవి ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ లో బి జెడ్ సి, ఎం జెడ్ సి ఎంపీసీఎస్, బి. కామ్ కంప్యూటర్ అప్లికేషన్, బి ఏ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల ఎస్టి విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని విద్యార్థులకు తెలిపారు. పూర్తి వివరాల కోసం ఈ కింది నంబర్ ను సంప్రదించగలరు. 7901097796.

### శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో

# ఘనంగా పూరి జగన్నాథ రథయాత్ర



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేటలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన పూరి జగన్నాథ రథయాత్ర ఘనంగా జరిగింది. దేవస్థానము నుంచి జయదీపిక ఎస్టేట్స్ వరకు సాగిన ఈ రథయాత్రను దేవస్థాన ధర్మకర్త కొలను శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన భక్తులతో కలిసి రథయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు భక్తి శ్రద్ధలతో రథయాత్రలో పాల్గొని జగన్నాథ స్వామికి జయజయధ్వానాలు చేశారు. రథయాత్ర ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో దేవస్థాన భక్తబృందం, ఆలయ ప్రధాన అర్చకులు బదరినారాయణ చార్యులు, వెంకటరమణ చార్యులు, వాసు వరగాని, ఏలూరి సత్య(నాని), రామచంద్రనాయక్, లక్మణ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 16న చెంగిచెర్ల బోనాలు



మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : ప్రతి ఏటా ఆషాడ మాసం అమ్మవారికి ఎంతో భక్తితో నిర్వహించే బోనాల పండుగను వచ్చేనెల ఆగస్టు 16వ తేదీ న చెంగిచెర్లలో బోనాల పండుగ నిర్వహించుటకు గ్రామ పెద్దలు, వివిధ కాలనీల అధ్యక్షులు సమక్షంలో ఆదివారం తీర్మానించారు. గ్రామ ప్రజలు , కాలనీ వాసులు అందరూ ఆగస్టు 16వ తేదీన బోనాలు పండుగను జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### హెచ్‌పీ గ్యాస్ సరఫరా లో

# ఉత్తమ అవార్డు గ్రహీత అనంతుల లక్ష్మీనారాయణ

*** అభినందించిన కలెక్టర్**




ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణానికి చెందిన పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ అనంతుల లక్ష్మీనారాయణ హెచ్‌పీసీఎల్ గ్యాస్ కంపెనీ సౌత్ సెంట్రల్ జోన్ నుంచి ప్రతిష్ఠాత్మక ఉత్తమ అవార్డు అందుకోవడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వినియోగదారులకు గృహావసర గ్యాస్ సిలిండర్లను సకాలంలో సరఫరా చేయడం, 99.9 శాతం ఈకేవైసీ పూర్తి చేయడం, 95 శాతం వినియోగదారుల గృహాల్లో భద్రతా తనిఖీలు నిర్వహించడం, 88 శాతం సురక్ష పైప్ లు మార్చడం వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడం వంటి అంశాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు హెచ్‌పీసీఎల్ గ్యాస్ కంపెనీ సౌత్ సెంట్రల్ జోన్ ఆధ్వర్యంలో ఈ అవార్డును విజయవాడలోని హెచ్‌పీసీఎల్ రిటైల్ రీజనల్ కార్యాలయంలో ఈ నెల 17న జరిగిన సౌత్ సెంట్రల్ జోన్ సేల్స్ ఆఫీసర్ల సమీక్ష సమావేశంలో హెచ్‌పీసీఎల్ సౌత్ సెంట్రల్ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ దేబేష్ పురోహిత్, డిప్యూటీ జనరల్ మేనేజర్లు ఉమాపతి, ఆశీష్ సింఘాల్, విజయవాడ రీజనల్ మేనేజర్ కోమర శ్రీనివాస్, డిప్యూటీ జనరల్ మేనేజర్ రాహుల్ సింగ్, ఖమ్మం ఏరియా సేల్స్ మేనేజర్ల చేతుల మీదుగా అనంతుల లక్ష్మీనారాయణ ఉత్తమ అవార్డును అందుకున్నారు . లక్ష్మీనారాయణను జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ త్రినాథ్ బాబులు అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సేవల్లో అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు తప్పకుండా లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజులపూడి రజిత, కేలోత్ నరేష్, దుర్గం రాజాబాపు పాల్గొన్నారు.

# నిజాంపేటలో విచ్చలవిడిగా 'బెల్ట్ షాపుల' దందా

*** పాఠశాల పక్కనే మత్తు విక్రయాలు!**





ప్రజాస్ఫూర్తి, నారాయణఖేడ్: నిజాంపేట్ :నిజాంపేట్ పరిధిలో అక్రమ మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నివాస ప్రాంతాల్లో, ముఖ్యంగా విద్యాసంస్థల సమీపంలో నిర్వహిస్తున్న 'బెల్ట్ షాపులు' స్థానికులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు తీవ్ర ఇబ్బందిగా మారాయి. పక్కా సమాచారం ఉన్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఈ దందా మరింత జోరందుకుంది.

*** మందుబాబుల నుండి అదనపు వసూళ్లు**

సాధారణ మద్యం ధరల కంటే ఇక్కడ అక్రమ విక్రయదారులు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. ప్రతి బాటిల్‌పై రూ. 30 నుండి రూ. 50 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు మందుబాబులే బహిరంగంగా చెబుతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా, ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలిస్తూ సాగిస్తున్న ఈ వ్యాపారంపై ఎవరికీ భయం లేకుండా పోయింది.

*** రాత్రింబవళ్లూ 'సిట్టింగ్'ల హంగామా**

ఈ అక్రమ మద్యం విక్రయ కేంద్రాల్లో పగలు, రాత్రి తేడా లేకుండా 'సిట్టింగ్'లు కొనసాగుతున్నాయి. మద్యం సేవించిన వారు రోడ్లపైకి వచ్చి గొడవలు చేస్తుండటంతో మహిళలు, చిన్నారులు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. పాఠశాల విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగించే మార్గంలోనే ఈ దుకాణాలు ఉండటం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

*** అధికారుల నిర్లక్ష్యం ఎటువైపు?**

అక్రమ మద్యం దందాను అరికట్టాల్సిన ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటోనని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదులు చేసినా క్షేత్రస్థాయిలో ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, అధికారుల పర్యవేక్షణ లోపం వల్లనే ఈ అక్రమ వ్యాపారాలు పడగవిప్పుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, నిజాంపేటలోని అక్రమ బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపాలని, పాఠశాలల సమీపంలో మద్యం విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# ఆర్యవైశ్యులు సామాజిక సేవకులు




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ఆర్యవైశ్యులు సామాజిక సేవకులని, ప్రతి గ్రామంలో బడిలోనూ గుడిలోనూ జరిగే సేవా కార్యక్రమాలలో తప్పనిసరిగా ఆర్యవైశ్యుల పాత్ర ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం సూర్యాపేట ఆర్యవైశ్య సంఘం పట్టణ కమిటీ ప్రమాణస్వీకారం స్థానిక రవి మహల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమరవాది లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో గెలుపొందినటువంటి అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు నాయకత్వంలో నూతన కమిటీ ఏర్పాటు చేసుకొని తాము మేనిఫెస్టో లో చెప్పిన హామిలు అమలు చేసే విధంగా వివిధ కమిటీలువేయడం హర్షణీయమని అన్నారు. పట్టణ అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు చేత జిల్లా అధ్యక్షులు ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రధాన కార్యదర్శి బిక్కమల్ల కృష్ణ, కోశాధికారి వుప్పల శ్రవణ్ కుమార్ తో పాటు ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు, యువజన సంఘం , మహిళా సంఘం అధ్యక్షులు కార్యదర్శులు కోశాధికారులు , మీడియా కమిటీ విద్యారంగం కమిటీ అడ్వకేట్స్ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రాయపూడి భవాని, ఇరుకుళ్ల రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమ్మడి సోమనర్సయ్య, కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్, క్రమశిక్షణ సంఘం సంఘం చైర్మన్ బండారు రాజా , ప్రముఖ పారిశ్రామిక వేత్త మీలామహదేవ్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల ఆనంద్, బొమ్మిడి లక్ష్మీనారాయణ, కక్కిరేణి చంద్రశేఖర్, కర్నాటి కిషన్, మాశెట్టి అనంత రాములు, తోట శ్యాం ప్రసాద్ , రాచర్ల కమలాకర్, రాచకొండ శ్రీనివాస్, ఈగ దయాకర్ గుప్తా , వుప్పల సత్యనారాయణ, బొమ్మిడి అశోక్, చల్లా లక్ష్మి ప్రసాద్, మిట్టపల్లి రమేష్, వ్యాపారులు, పలువురు మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజేతగా నిలిచిన పి.వి. సింధుకు అభినందనలు



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ ఫైనల్ మ్యాచ్ లో జపాన్ కు చెందిన అకానే యమగూచిని 2117, 2117 తేడాతో ఓడించి, జపాన్ ఓపెన్ టైటిల్ ను గెలిచిన తొలి భారత మహిళా షట్లర్‌గా చరిత్ర సృష్టించిన సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హాకీ అసోసియేషన్ చైర్మన్ తరఫున పల్లపోతు శ్రీనివాసు (వాసు) హర్షం వ్యక్తం చేస్తూ పి.వి. సింధుకు హృదయపూర్వక అభినందనలు తెలియ జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత క్రీడా రంగానికి మరిన్ని విజయాలను అందించాలని ఆయన ఆకాంక్షించారు .

# గ్రీవెన్స్ హెల్ప్ డెస్క్ ద్వారా దరఖాస్తులు స్వీకరణ

*** జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా : ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో నేడు జరిగే ప్రజావాణి కార్యక్రమం హెల్ప్ డెస్క్ ద్వారా దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. సోమవారం ఉమ్మడి జిల్లా మంత్రివర్యుల సమావేశం సంగారెడ్డి లో ఉన్నందున. జిల్లా కలెక్టర్, తోపాటు వివిధ శాఖల అధికారులందరూ సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశానికి హాజరు కావాల్సి ఉన్నందున అధికారులు అందుబాటులో ఉండరు. ఈ రోజున జరగాలిసిన గ్రీవెన్స్ దరఖాస్తుల ని హెల్ప్ డెస్క్ ద్వారా స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. దయచేసి జిల్లా ప్రజలు ఈ విషయం గమనించగలరు.

# బజరంగ్ సానిటరీ ఎలక్ట్రికల్ షోరూమ్ ప్రారంభం



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నగరంలో నూతనంగా దేవరకొండ రోడ్డులో ఆధునిక స్పేర్ పార్ట్స్ తో ఏర్పాటు చేసిన బజరంగ్ సానిటరీ & ఎలక్ట్రికల్స్ షోరూమ్‌ను నగర మేయర్ శనివారం బుర్రి చైతన్య శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ కొబ్బరికాయ కొట్టి, అనంతరం రిబ్బన్ కట్ చేసి షోరూమ్‌ను ప్రారంభించారు. నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆశ్రఫ్ అలీ అమీర్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, కార్పొరేటర్స్ పిల్లి కృష్ణమరాజు, రమ్యశ్రీ రాఖి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్ మాజీ కౌన్సిలర్లు జానయ్య ప్రదీప్ కుమార్ , నిర్వాహకులు బెల్లి దానయ్య,బదం సింగ్, జగదీష్ సింగ్,వేరోసింగు తదితరులు పాల్గొన్నారు.

# మేరు సంఘం జిల్లా నూతన కమిటీఎన్నిక



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : నల్లగొండ జిల్లా మేరు సంఘం నల్లగొండ పట్టణ మేరు సంఘానికి ఆదివారం స్థానిక ఎస్బిఐ గార్డెన్లో జరిగిన ఎన్నికలలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బోనగిరి సురేందర్ మేరు, ప్రధాన కార్యదర్శిగా గుంటి రామకృష్ణ మేరు,నల్లగొండ పట్టణ అధ్యక్షుడిగా నామ రాంప్రసాద్ మేరు ప్రధాన కార్యదర్శిగా రాపర్తి వెంకటేశ్వర్లు మేరు లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు భువనగిరి సురేందర్ ప్రధాన కార్యదర్శి గుంటి రామకృష్ణ మాట్లాడుతూ మేరు కులస్తుల అభివృద్ధికి సంక్షేమానికి సంఘ పటిష్టతకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మేరు కులస్తులకు అందడానికి కృషి చేస్తామన్నారు.ఈ సందర్భంగా నూతన కమిటీని మేరు కులస్తులు నాయకులు ఘనంగా సాల్వాలతో సన్మానించి అభినందించారు.

# కామన్ పల్లిలో ఘనంగా ప్రీప్రైమరీ తరగతుల ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, జన్నారం : మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కామన్ పల్లి ప్రాథమిక పాఠశాలలో చిన్నారుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన ప్రీప్రైమరీ తరగతులను గ్రామ సర్పంచ్ & సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు పేరం శ్రీనివాస్ రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో భాగంగా, చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రీ ప్రైమరీ తరగతులను అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమని అన్నారు. అంగన్‌వాడీలకు దీటుగా, ప్రభుత్వ పాఠశాలల్లోనే అత్యాధునిక వసతులతో విద్యను అందించడం వల్ల పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం షఫీక్, గోవింద్ నాయక్, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ది అడ్వకేట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్న వాకిటి నరసింహారెడ్డి




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రంగారెడ్డి జిల్లా హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలోనిది అడ్వకేట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ (టీఏఎంఏసీఎస్) ఎన్నికలు సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టులో ఆదివారం జరిగాయి. చౌటుప్పల్ సివిల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది, చౌటుప్పల్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వాకిటి నరసింహారెడ్డి ఎన్నికల్లో పాల్గొని, తన అమూల్యమైన ఓటును వినియోగించుకున్నారు.

# బుల్లెట్ ట్రైన్ సాధనకై ఐక్యంగా ఉద్యమించాలి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధన కు అందరూ ఐక్యంగా ఉద్యమించాలని ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆరుట్ల జానకి రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ గ్రాండ్ కాన్ఫరెన్స్ హాల్ లో జరిగిన అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల తో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేట వంటి ప్రధాన వాణిజ్య, విద్యా, పారిశ్రామిక కేంద్రాన్ని బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ నుంచి తొలగించడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదు దశాబ్దాలుగా సూర్యాపేటకు రైల్వే సౌకర్యం వస్తుందని చెబుతున్నప్పటికీ ఇప్పటికీ ఆ కల నెరవేరలేదన్నారు. అలైన్‌మెంట్‌లో సూర్యాపేటను పక్కన పెట్టడం ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛను దెబ్బతీసిందని పేర్కొన్నారు. బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కన్వీనర్ గా ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆరుట్ల జానకి రెడ్డి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు గౌరవ సలహాదారులుగా పెద్దిరెడ్డి గణేష్, చెన్నోజు రమణాచారి ని ఎన్నుకున్నారు. అన్ని పార్టీలు ప్రజా సంఘాల నుండి కో కన్వీనర్ గా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు జుట్టుకొండ సత్యనారాయణ, పెద్దిరెడ్డి రాజా, మల్లు నాగార్జున రెడ్డి, మందారి డేవిడ్ కుమార్, కొత్తపల్లి శివకుమార్, బూర వెంకటేశ్వర్లు, వరికుప్పల వెంకన్న, గట్ల రమాశంకర్, ఇస్మాయిల్, మీలా మహదేవ్, కొల్లి మధుసూదన్ రావు, డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్, నూకల సుదర్శన్ రెడ్డి, అనువులపురి రవిబాబు, పెద్దిరెడ్డి గణేష్, తల్ల మల్ల హసేన్, చిన్నోజు రమణాచారి, మట్టి పెల్లి సైదులు, భూపతి రాములు, పేర్ల నాగయ్య, తుక్కాని మన్మధ రెడ్డి, చల్లమల్ల నరసింహ, రేపాక లింగయ్య, ఆవుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# కొండాపూర్‌లో కన్నులపండువగా శ్రీ జగన్నాథ రథయాత్ర!




శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : కొండాపూర్ రాఘవేంద్ర కాలనీలో శ్రీ జగన్నాథ రథయాత్ర ఆదివారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగింది. బంజారాహిల్స్ ఇస్కాన్ టెంపుల్ మరియు హరే కృష్ణ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక వేడుకను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ యాదవ కురుమ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్ ప్రత్యేక పర్యవేక్షణలో జరిగిన ఈ పవిత్ర యాత్రలో శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని, జగన్నాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పవిత్ర యాత్రకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. హరినామ సంకీర్తనలు, భక్తుల జయజయధ్వానాల మధ్య జగన్నాథుడి రథం ముందుకు సాగింది. భక్తులంతా స్వామివారిని దర్శించుకుని, పూజలు నిర్వహించి తరించారు.

# ఘనంగా హాతీరాం బావాజీ జయంతి వేడుకలు

*** బంజారాల సంస్కృతిని కాపాడుకోవాలి: మేయర్ గణేష్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: శ్రీ వెంకటేశ్వరస్వామితో పాచికలు ఆడిన అత్యంత ప్రియమైన భక్తుడు హాతీరాం బావాజీ 597వ జయంతి వేడుకలను బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ బానోత్ వీరునాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని ప్రకృతి ఆశ్రమంలో ఆదివారం నిర్వహించిన వేడుకలకు కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ నాయక్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. గిరిజన పూజారులు, సాధు సంత్‌లు ప్రత్యేక పూజలు, హోమం, భోగ్‌బండార్ కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ గణేష్ మాట్లాడుతూ బంజారాల సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేటి తరానికి మన పూర్వీకుల విశిష్టతను తెలియజేయాలని కోరారు. శ్రేయాస్ మీడియా చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొని పూజా కార్యక్రమాలను ప్రత్యక్షంగా తిలకించారు. జగదంబ సేన వ్యవస్థాపక అధ్యక్షులు తేజావత్ రాములు, జేఏసీ చైర్మన్ వీరూనాయక్ మాట్లాడుతూ ప్రతీ ఏడాది సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను నిర్వహించిన విధంగానే బంజారాలంతా కలిసికట్టుగా ఉంటూ శ్రీ హాతీరాం బావాజీ జయంతి వేడుకలను సైతం నిర్వహించుకునేందుకు బంజారాలంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వచ్చేనెలలో జరగనున్న తీజ్ వేడుకలకు జేఏసీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కేశవ్, భద్రు, హనుమంతు, మంచ్యా నాయక్, శంకర్ నాయక్, సర్పంచ్ లైలా, సాధు సంత్‌లు భద్య, శంకర్, బాలు, రమేష్, గురు, లచ్చు, బాలు, సక్రు, మిట్టు, యువశక్తి చంద్రకళ, శివశక్తి సౌజన్య, టిఎస్‌టిటిఎఫ్ నాయకులు బి.రాములు, బి. రమేష్ రాథోడ్, రత్నాకర్, బి.మోహన్, బాలకృష్ణ, బాబులాల్, రవి, చందర్, వీరన్న, మోహన్, నర్సింహా, పీఆర్‌టీయూ నాయకులు బి.భాస్కర్, టి.మోహన్, యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపకులు జె.బి. బాలు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్య సహకార సంఘం ఎన్నికల నేపథ్యంలో నల్గొండ పట్టణంలో

# బీఎన్ఎస్ సెక్షన్ 163 (సెక్షన్ 144) అమలు

*** ఎస్పీ శరత్చంద్ర పవార్**

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం మూసీ గ్రామానికి చెందిన మత్స్య శాఖ సహకార సంఘం లిమిటెడ్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ ఎన్నికలు నల్గొండ పట్టణంలోని మహిళా సమాఖ్య భవన్, మిర్యాలగూడ రోడ్ (డీటీసీ సమీపంలో) నిర్వహించనున్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా జూలై 20, 21 తేదీల్లో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 163 (పూర్వపు సీఆర్‌పీసీ సెక్షన్ 144) అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, తెలిపారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ కేంద్రం, పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సెక్షన్ 163 అమలులో ఉన్న సమయంలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుంపులుగా చేరడం, అనుమతి లేని ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, సభలు నిర్వహించడం పూర్తిగా నిషేధించబడిందని తెలిపారు. ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులు, వారి ప్రతినిధులు, సభ్యులు, మద్దతుదారులు ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని సూచించారు. ఎన్నికల ప్రాంగణంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సూచనలను తప్పనిసరిగా అనుసరించాలని కోరారు. ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మకుండా శాంతియుత వాతావరణాన్ని కాపాడేందుకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సందర్భంగా ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే వారి మీద కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# మండల పరిషత్ ముందు మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ

*** విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ కోదండరాం..**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్: వీరులారా.. వందనం.. మహనీయులారా.. వందనం.. అంటూ దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలు అర్పించిన ఉద్యమకారులు, పోరాట యోధులతో పాటు దేశానికి వన్నెతెచ్చిన శాస్త్రవేత్త విగ్రహావిష్కరణల సందడి పట్టణంలోని మండల పరిషత్ వద్ద కనిపించింది. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో పట్టణంలోని పాత జాతీయ రహదారి పక్కన మండల పరిషత్ ప్రహరీ ముందు జాతిపిత మహాత్మాగాంధీ, బహుముఖ ప్రజ్ఞాశాలి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, స్వతంత్ర పోరాట యోధుడు రాజా వెంకటరెడ్డితో పాటు శాస్త్రవేత్తగా ప్రపంచం వ్యాప్తంగా దేశానికి వన్నె తెచ్చి, రాష్ట్రపతిగా నిస్వార్థ పాలనతో ప్రజల హృదయాలలో నిలిచిపోయిన అబ్దుల్ కలాం, యుద్ధనౌక గద్దర్ విగ్రహాలను మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కోదండరాంరెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ అగునూరు బస్వం, వైస్ చైర్మన్ అందే మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం గిరిజన ఆదివాసి కోఆర్డినేటర్ పి.రఘు, చెంది తిరుపతి రెడ్డి, కృష్ణారెడ్డి, అగునూరు విశ్వం, సజీవన్, ముబారక్ అలీ ఖాన్ లతోపాటు ఐకాసా నాయకులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు

# వర్షాల కోసం మల్లన్న స్వామి కి జలాభిషేకం

*** కురుమ సంఘం ఆధ్వర్యంలో వరుణదేవుని ఒగ్గుకథ లో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండి ప్రజలంతా సంతోషంగా ఉండాలని మెదక్ మున్సిపల్ చైర్మన్ నరేష్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మెదక్ పట్టణంలోని నవాబుపేటవీధిలో మల్లన్నస్వామి ఆలయంలో మల్లన్న స్వామికి జలాభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా వరుణ దేవునిపై ఒగ్గుకథ చెప్పారు. కుర్మసంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నరేష్‌గౌడ్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్తెలు కరిగి పోతున్నా. వర్షాలు లేక జిల్లాలో వరి నారుపోసిన రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. కరువు ఛాయలు తొలగిపోయి సమృద్ధిగా వర్షాలు కురియాలంటూ వరుణదేవుని పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు వరుణ దేవుని పాటపాడుతూ బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం సభ్యులు పెంటయ్య, ఆశయ్య, సాయిలు ,లింగం, మల్లయ్య, ఒగ్గు కళాకారులు దుర్గయ్య,వెంకట్ రాములు, బీరప్ప, బిక్షపతి, యాదగిరి, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బహదూర్‌గూడ వ్యవహారం.. 36 మందిపై కేసులు




హైదరాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలోని బహదూర్‌గూడ భూముల వ్యవహారంలో జరిగిన ఆందోళన నేపథ్యంలో పలువురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. మహిళలు, స్థానిక రైతులు, బీఆర్ఎస్, భాజపా నేతలతోపాటు 36 మందిపై కేసులు పెట్టారు. వీరిలో పటోళ్ల కార్తిక్ రెడ్డి, పంతంగి భూపాల్‌రెడ్డి, మహేందర్, కోలన్ ప్రదీప్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించినందుకు కేసులు నమోదు చేశారు. విమానాశ్రయానికి, ఓఆర్ఆర్‌కు మధ్య బహదూర్‌గూడలో సర్వే నం.62లో 500 ఎకరాలు, సర్వే నం.28లో 150 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. ఏళ్లుగా స్థానికులు వాటిని సాగు చేసుకుంటున్నారు. బుల్లెట్ రైలు, ఆర్టీసీ బస్సు ప్రాజెక్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ భూములను స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమైందనే సమాచారంతో కొన్నిరోజులుగా రైతులు గ్రామం వద్ద దీక్ష చేపట్టారు. కంచె నిర్మాణాన్ని వారు అడ్డుకుంటారనే ఉద్దేశంతో హైడ్రా.. పోలీసు బందోబస్తుతో శనివారం వేకువజామున రంగప్రవేశం చేసింది. దీక్షా శిబిరాన్ని తొలగించి ఆ ప్రాంతంలో ఫెన్సింగ్ వేసింది. తమకు న్యాయం చేయాలని 8 రోజులుగా భూముల వద్ద దీక్ష చేస్తున్న రైతులు.. అక్కడికి వచ్చి హైడ్రాను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో కొందరు ఆందోళనకారులు పోలీసులపై కారం చల్లి, కుర్చీలు విసిరారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో పలువురిపై పోలీసులు కేసులు నమోదుచేశారు. మరోవైపు 650 ఎకరాల ప్రభుత్వ భూముల స్వాధీన ప్రక్రియ కొనసాగుతోంది.

# ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించిన మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థులు



ప్రజాస్ఫూర్తి ,మెదక్ జిల్లా: మల్లారెడ్డి యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ కు చెందిన వ్యవసాయ విద్యార్థులు మాచవరం గ్రామంలో రైతులకు ఎల్ నినో ప్రభావంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు నీటి పొదుపు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులు మాట్లాడుతూ తక్కువ నీటితో సాగు చేయగల జొన్న, సజ్జ, రాగి, పెసర, మినుము, కంది, శనగ, వేరుశెనగ, నువ్వులు వంటి పంటలను సాగు చేయడం వల్ల వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవచ్చని వివరించారు. అలాగే నీటి వినియోగంలో పొదుపు పాటిస్తూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పావని, దుర్గ, లక్ష్మీ ప్రసన్న రెడ్డి, ప్రియాంక, హితశ్రీ, రక్షిత, పూజిత రెడ్డి, పావని, శ్రేయ రెడ్డి, రమ్య, రష్మిక, నిహారిక పాల్గొన్నారు.

# అంకితభావంతో పని చేయండి.. కేశిరాజు లక్ష్మి నరసింహ రావు



ప్రజా స్ఫూర్తి, కూసుమంచి: కూసుమంచి గ్రామ పెద్దలు కేశిరాజు లక్ష్మి నరసింహ రావు పెద్దలు కేశిరాజు లక్ష్మి నరసింహ రావు దీవెనలు మాకు కొండంత బలం బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి ఆదివారం కూసుమంచి మండల కేంద్రంలో కూసుమంచి గ్రామ ప్రముఖులు స్వర్గీయ కేశిరాజు రంగారావు కుమారులు కేశిరాజు లక్ష్మి నరసింహ రావుని మర్యాదపూర్వకంగా వారి వ్యవసాయ క్షేత్రంలో స్థానిక 8 వ వార్డు సభ్యులు మరియు బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి కలవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూసుమంచి అభివృద్ధి కొరకు నిబద్ధతతో అందరూ కలిసికట్టుగా పని చేయాలి అని సూచించారు. అదేవిధంగా గ్రామ అభివృద్ధి కోసం తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పడం జరిగింది. అదేవిధంగా మీరు తలపెట్టినా నమస్తే కూసుమంచి కార్యక్రమం చాలా మంచి కార్యక్రమం అని, దానిని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా నిత్యం దేశం, గ్రామం కోసం పరితపిస్తూ పర్యావరణ పరిరక్షణ కోసం, ప్రకృతి సమతుల్యం కోసం వివిధ కార్యక్రమం లు చేస్తున్న పుణ్య దంపతులకు ఒక చిన్న మొక్కను ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు చెరుకుపల్లి వీరయ్య, అర్వపల్లి శ్రీను, ఉపేందర్, మధు తదితరులు పాల్గొన్నారు.

# షాద్నగర్ లో అమరవీరుల స్థూపం ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : షాద్నగర్ లో అమరవీరుల స్థూపం తెలంగాణ మలిదశ అమరవీరులను స్మరిస్తూ వీరి యొక్క త్యాగాలు మన తెలంగాణకు వన్నెతెచ్చినవని యావత్ ప్రపంచంలో తెలంగాణ అమరవీరులను గుర్తు చేసుకుంటున్నారని తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. అమరవీరుల స్థూపం, మహనీయుల విగ్రహాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఫరూక్ నగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, మల్కాయ్ గారి గోవర్ధన్ రెడ్డి తాలూకా ఉప సర్పంచ్ అధ్యక్షులు, ఫరూక్నగర్ మండల శ్రీ ఉపసర్పంచ్ అధ్యక్షులు ముక్కుపోవుల ప్రకాష్ గౌడ్, లయన్ యం.రవికుమార్ సీనియర్ ఫోటోగ్రాఫర్, శ్రీశైలం సీనియర్ ఫోటోగ్రాఫర్, మహేందర్ గౌడ్ ఫోటోగ్రాఫర్, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇస్రో తొలి ప్రైవేట్ రాకెట్ ప్రయోగంలో భాగమైన శ్రీ చైతన్య పూర్వ విద్యార్థి వినయ్



పాలేరు, ప్రజా స్ఫూర్తి: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శ్రీహరికోటలో నిన్న విజయవంతంగా నిర్వహించిన భారతదేశపు తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ ప్రయోగంలో శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ,రీసెర్చ్, ఖమ్మం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పూర్వ విద్యార్థి వినయ్ కుమార్ ఇంజనీర్ గా బాధ్యతలు నిర్వర్తించడం కళాశాలకు గర్వకారణమని కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అత్యున్నత అంతరిక్ష పరిశోధనా కార్యక్రమంలో తమ కళాశాల పూర్వ విద్యార్థి భాగస్వామి కావడం ప్రతి అధ్యాపకుడికి, విద్యార్థికి, యాజమాన్యానికి గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేస్తే ప్రపంచస్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని వినయ్ కుమార్ మరోసారి నిరూపించారని అన్నారు. కళాశాల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీ విద్య మాట్లాడుతూ, కళాశాలలో విద్యార్థులు పొందే నాణ్యమైన సాంకేతిక విద్య, ఆధునిక ప్రయోగశాలలలో అందించే ప్రాక్టికల్ శిక్షణ, పరిశోధనా దృక్పథం, క్రమశిక్షణ, నైతిక విలువలు , అధ్యాపకుల నిరంతర మార్గదర్శకత్వం విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసే విద్యా వాతావరణాన్ని కళాశాల ఎల్లప్పుడూ కల్పిస్తోందని చెప్పారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ, విద్యార్థి దశలో తరగతి గది బోధనతో పాటు ల్యాబ్‌లలో పొందిన ప్రాక్టికల్ అనుభవం, మినీ మరియు మెజర్ ప్రాజెక్టులు, సాంకేతిక కార్యక్రమాల్లో పాల్గొనడం, పరిశ్రమలతో అనుసంధానం, అధ్యాపకుల నిరంతర ప్రోత్సాహం వినయ్ కుమార్ విజయానికి బలమైన పునాదిగా నిలిచాయని పేర్కొన్నారు. కళాశాలలో అలవర్చుకున్న క్రమశిక్షణ, సమయపాలన, సమస్యలను విశ్లేషించే నైపుణ్యం, జట్టు భావన వంటి లక్షణాలే నేడు ఇస్రో వంటి అత్యున్నత సంస్థలో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించడానికి దోహదపడ్డాయని అన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, శ్రీ చైతన్య విద్యాసంస్థలు కేవలం డిగ్రీలను అందించడమే కాకుండా దేశ నిర్మాణంలో భాగస్వాములు అయ్యే నైపుణ్యం కలిగిన ఇంజినీర్లను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ భవిష్యత్ సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. వినయ్ కుమార్ సాధించిన ఈ ఘనత కళాశాల విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకమని, ఈ విజయం మరెందరో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగేందుకు ప్రేరణగా నిలుస్తుందని కళాశాల యాజమాన్యం పేర్కొంది. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరెన్నో జాతీయ, అంతర్జాతీయ విజయాలను సాధించే విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కళాశాల కట్టుబడి ఉందని తెలిపింది.ఈ సందర్భంగా కళాశాల ఎగ్జిక్యూటివ్ డీన్ డాక్టర్ వి. సుదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ చార్యులు, శ్రీ కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు వినయ్ కుమార్‌ను హృదయపూర్వకంగా అభినందించారు.ఆయన భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి భారతదేశానికి, తెలంగాణ రాష్ట్రానికి, శ్రీ చైతన్య విద్యాసంస్థలకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

## కేకే కమిటీ కాలయాపన చేయకుండా

* తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ఉద్యమకారులారా గమనించండి గత కెసిఆర్ బిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులను వాడుకొని వదిలేసిన సంగతి మన అందరికీ తెలుసని వారన్నారు. సోమారపు వీరస్వామి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి,మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ పార్టీని బొందపెట్టి తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీకి బహుమతిగా కాంగ్రెస్ పార్టీని బలపరచి రేవంతన్న నాయకత్వానికి సపోర్టు చేసి గెలిపించాలని పట్టుబట్టి కాంగ్రెస్ పార్టీ పెట్టిన ఆరు గ్యారెంటీ లల్లో ఉద్యమకారులకు రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం టి యు ఎఫ్ అనే నామకరనముతొ వ్యవస్థాపక చైర్మెన్ గా డాక్టర్ చీమ శ్రీనివాస్ పిడికెడు మందిని వెంటబెట్టుకొని ఉద్యమకారులను గుర్తింపు చేసి వారికి గుర్తింపు కార్డులను ఇస్తూనే జార్ఖండ్, ఉత్తరాంచల్ తరహాలో సంక్షేమ పథకాలు, పెన్షన్ సౌకర్యం,ఆరోగ్య కార్డులు, బస్ పాసులు, 250చ"గజాల ఇంటిస్థలం ఇచ్చి ఇల్లు కట్టిఇస్తామని రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. అందకు పలితంగా గత 2018 నుండి నేటి వరకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం టి యు ఎఫ్ పేరుతో రాష్ట్రంలో ముప్పై మూడు జిల్లాల్లో గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు మండల, డివిజన్, జిల్లాలు పూర్తి స్థాయిలో ఉద్యమకారులను ఏకంచేయడం జరిగింది.ఆ రోజుల్లో రాజకీయ జెఎసి నాయుడు అనబడే డాక్టర్ కోదండరాం ఉద్యమకారుల ఊసెత్తకుండా తెలంగాణ జన సమితి అనే పార్టీ పెట్టుకొని ఉద్యమకారులను వదిలేసుకొన్నారు.వారు వదిలేసిన ఉద్యమాన్ని డాక్టర్ చీమ.శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం టి యు ఎఫ్ పేరును నెత్తిన ఎత్తుకొని తెలంగాణ ఉద్యమకారుల బారం, బాధ్యతలు మోస్తూనే కేకే కమిటీ పదేలా చేసినారు.

## పేరులో 'నే'ముంది – సేవాగుణంలో ప్రభు 'దయాళ్'డు

* రిటైర్డ్ ఎంఈఓ సేవలు అభినందనీయం



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఎవరైనా తమకు తల్లిదండ్రులు పెట్టిన పేరును సార్ధకం చేసుకోవాలనుకుంటారు. ఇంకొందరు ఆ పేరును చరిత్రపుటల్లో లిఖించుకుంటారు. అలా తన పేరులో ఉన్న సద్గుణాన్ని పుణికిపుచ్చుకుని అందరిచే శభాష్ అనిపించుకుంటున్నారు రిటైర్డ్ ఎంఈఓ ప్రభుదయాళ్. భద్రాచలం ఐటీడీఏ బీఈడీ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్‌గా నాడు కళాశాలను ఉన్నతంగా తీర్చిదిద్ది జాతీయ ఉపాధ్యాయ మండలి న్యూఢిల్లీ వారి ప్రత్యేక గుర్తింపును సాధించిన డాక్టర్ ప్రభుదయాల్ పేరుకు తగ్గట్టు నిజాయితీగా గిరిజనుల సంక్షేమార్ధం పనిచేస్తున్నారు. ఇటీవలే కొత్తగూడెం ఎంఈఓగా పదవీ విరమణ చేసిన ఆయన మండలాన్ని రాష్ట్రంలోనే ఉన్నత స్థానంలో ఉంచి, ప్రభుత్వంచే ప్రత్యేకంగా గుర్తించబడ్డారు. బీదల పట్ల ఆయన చూపే దయ గొప్పదని, ఈ విషయంలో తన పేరును సార్ధకం చేస్తున్నారని జిల్లా పూర్వ కలెక్టర్ జితేష్ వి పాటిల్ సైతం కొనియాడారు. అవసరం ఉన్న వారి పట్ల అప్పటికప్పుడు స్పందించే గుణంతో మంచిపేరు సంపాదించుకున్నారు. డాక్టర్ దయాళ్ పదవీ విరమణ చేసినప్పటికీ తన శక్తిమేర ఇతరులకు తోడ్పాటునందిస్తున్నారు. బీదలకు వస్త్రాలు, ఆహార పదార్థాలు, విద్యార్థులకు పుస్తకాలు అందిస్తూ తన పేరులో ఉన్న దయార్థ హృదయాన్ని చాటిచెప్తున్నారు. ఆయన పనితీరు పట్ల పలువురు ఐఏఎస్ అధికారులు సర్వీసు రిజిస్టర్‌లోనే ప్రశంసలు రికార్డు చేయడం అత్యంత అరుదైన విషయం. ఇల్లందులో జన్మించి కొత్తగూడెంలో సెటిల్ అయిన ప్రభు దయాళ్ జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేయడం భద్రాద్రి జిల్లాకే మణిహారంగా నిలుస్తోంది.

## జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని మంత్రి పొంగులేటికి వినతి



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండలాల్లో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి జర్నలిస్టులు వినతిపత్రం అందచేశారు. ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చిన పొంగులేటిని చుంచుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో జర్నలిస్టులు కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ఎన్నో సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపిన జర్నలిస్టులు సొంత ఇళ్లు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇళ్ల స్థలాల కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నామని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టులకు ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల□స్థలాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. గతంలో జిల్లా కేంద్రంలో జర్నలిస్టుల ఇళ్లస్థలాల నిమిత్తం రామవరం వంతెన సమీపంలో 10 ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరిగిందని, కొన్ని అనివార్య కారణాలతో స్థలాల కేటాయింపు మధ్యలోనే నిలిచిపోయిందని అన్నారు. త్వరితగతిన అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి పొంగులేటిని కలిసిన వారిలో జర్నలిస్టులు కల్లోజి శ్రీనివాస్, వీరు నాయక్, వట్టికొండ రవి, నాగచంద్ర, ప్రవీణ్, పాపారావు, పురం శ్రీనివాస్, తారక్, రాజేందర్, బాబు, షఫి, దశరథ్ రజువా, ఎ.మనోజ్ కుమార్, ఎన్.రాజేష్, దుర్గ, ఎం.రాజేష్, సురేష్, రవి, నాగేశ్వరరావు, సంతోష్, నరేష్, పురుషోత్తం, నవీన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## హైదరాబాదును కేంద్ర పాలిత ప్రాంతంగా చేయాలనే కుట్రను ఖండించండి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి ; హైదరాబాద్ ను కేంద్రపాలిత ప్రాంతంగా చేయాలని, తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీయాలని ఏ రాజకీయ పార్టీ ఆలోచన చేసిన మరో తెలంగాణ ఉద్యమం అనివార్యమని రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయక రెడ్డి అన్నారు. ఆదివారం మహబూబాబాద్ లోని నలంద డిగ్రీ కళాశాలలో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కన్వీనర్ మామిడాల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం లో పాల్గొని మాట్లాడారు.హైదరాబాద్ ను దేశానికి రెండవ రాజధానిగా చేయాలనే డాక్టర్ అంబేద్కర్ నాటి ఆలోచనలకూ నేటి పరిస్థితులకు చాలా వ్యత్యాసం ఉందని తెలిపారు.రాజకీయ స్వలాభంకోసం హైదరాబాద్ ను కేంద్రపాలిత ప్రాంతం గా చేస్తే తెలంగాణ తలలేని మొండెం గా మారుతుందని అన్నారు. తెలంగాణ పై సాంస్కృతిక దాడి జరుగుతూనే ఉందని,తెలంగాణ కు 60% ఆదాయంను సమాకురుస్తున్న హైదరాబాద్ యు టి గా మారితే తెలంగాణ అభివృద్ధి జరగదని తెలిపారు. అస్తిత్వ వాదానికి, ప్రాంతీయ వాదానికి తేడా తెలుసుకొని ఆయా రాజకీయ పార్టీలు ప్రవర్తించాలని,ఓట్ల కోసం హైదరాబాద్ ను ఆగం చేయవద్దని అన్నారు.ఈ కార్యక్రమంలో టి పి టి ఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు బి.కొండల్ రెడ్డి మాట్లాడుతూ నాటి తెలంగాణ సాయుధ రైతంగా పోరాటం ఫలితాలను ఇంకా పొందలేక పోతున్నామన్నారు. హైదరాబాద్ కేంద్రపాలిత ప్రాంతమైతే అన్నీ రకాలుగా నష్టపోతామని అన్నారు.సర్ పై ఐటి ప్రొఫెసనల్ రణధీర్ మాట్లాడుతూ ఓటును కోల్పోకుండా పౌరులు జాగ్రత్తగా ఉండాలని,నోటీసులు వస్తే అవసరమైన డాక్యూమెంట్స్ అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో సిపిఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, జేఏసీ నాయకులు డాక్టర్ డోలి సత్యనారాయణ, బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు మార్నినేని వెంకన్న, టి పి జేఏసీ స్టేట్ కో కన్వీనర్ మైస శ్రీనివాసులు,ఎం సి పి ఐ జిల్లా నాయకులు కంచ వెంకన్న, న్యూడెమోక్రసీ నాయకులు అలకుంట్ల సాయిలు, జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్, టి పి టి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. కవిత, టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి,టి పి టి ఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చుంచు శ్రీశైలం, టి పి టి ఎఫ్ జిల్లా నాయకులు.బాలస్టీ రమేష్,విష్ణు వర్దన్ రెడ్డి,రాచకొండ ఉపేందర్,సోమరాపు ఐలయ్య,ప్రముఖ కళాకారులూ కోమిరే సాకి,ఆర్టీసీ నాయకులు పట్టాభి లక్ష్మయ్య, పి డి ఎస్ యు నాయకులు బోనగిరి మధు, తెలంగాణ విద్యార్థి నాయకులు చిత్తారి సోమన్న,ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు బోడ లక్ష్మణ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు, బందు నారాయణ, యాదగిరి,షేక్ జానీ, సోమ విష్ణు వర్ధన్, హలవత్ లింగ్యా, అడ్వకేట్స్ కాలేరు శ్రీనివాస్,రాజమణి, స్వాతి,సామ పాపయ్య,బట్టు చైతన్య,ఆటో యూనియన్ నాయకులు నలమాస సాయి తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలదే కీలకపాత్ర

* ఎస్సై ఉదయ్ కిరణ్



ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం మండలంలోని పోనకల్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న వ్యాపారస్తులతో ఆదివారం రోజున ముఖాముఖి సమావేశం నిర్వహించి నేరాల నియంత్రణ లో సీసీ కెమెరాలు వాటి ముఖ్యపాత్ర పై ఎస్సై ఉదయ్ కిరణ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ "ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం" అని తెలిపారు. నేటి పరిస్థితులలో నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. సీసీ కెమెరాలు ద్వారా దొంగతనాలు, గొలుసులు లాక్కెళ్ళడం, గొడవలు వంటి నేరాలను అరికట్టవచ్చు అని, రోడ్డు ప్రమాదాలకు సంబంధించి వాస్తవాలను త్వరగా గుర్తించి బాధితులకు త్వరగా న్యాయం చేయడం సులభతరం అవుతుందని, అసాంఘిక శక్తులు అనుమానాస్పద వ్యక్తుల కదలికలను ముందుగానే గుర్తించి నేరాలను నివారించవచ్చని, మహిళలు చిన్నారులు వృద్ధుల భద్రత మరింత మెరుగు పడుతుందని, పోలీస్ కేసు దర్యాప్తులలో కీలకమైన సాక్ష్యాలు లభించి నేరస్తులను త్వరితగతిన అరెస్టు చేయడానికి ఉపయోగపడుతుందని, వ్యాపార సంస్థలు దుకాణాలు నివాస ప్రాంతాల భద్రత గణనీయంగా పెరుగుతుందని, ప్రజలలో భద్రత భావం పెరిగి నేరస్తులలో భయాందోళన కలిగిస్తుందని, అత్యవసరంలో పోలీస్ లకు వేగంగా స్పందించే అవకాశం ఉంటుందని, పట్టణాలు గ్రామాలను సురక్షిత ప్రాంతాలుగా తీర్చి దిద్దడంలో సీసీ కెమెరాలే కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. అందువలన ప్రతి వ్యాపార సంస్థలలో, అపార్ట్మెంట్లలో, నివాస గృహాలలో, విద్యా సంస్థలలో, మరియు ప్రజా ప్రదేశాలలో నాణ్యత మైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవి పని చేసే స్థితిలో ఉంచాలని అన్నారు. అవసరమైతే పోలీస్ శాఖ వారికి ప్రతి ఒక్కరు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉదయ్ కిరణ్ తో పాటు పోలీస్ సిబ్బంది, స్థానిక వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## అల్ప్రాజోలం తయారీ.. 12 మందిని అరెస్ట్ చేసిన ఈగల్ ఫోర్స్

భూత్పూర్: మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లో ఈగల్ ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. కోళ్ల ఫారంలో నిర్వహిస్తున్న అల్ప్రాజోలం తయారీ యూనిట్ గుట్టురట్టు చేశారు. ఈ వ్యవహారంలో 12 మందిని అరెస్ట్ చేయగా.. 23 మంది పరారీలో ఉన్నారు. ప్రధాన నిందితుడిని జయప్రకాశ్ గౌడ్‌గా గుర్తించారు. నిందితుడు గతంలో బోయిన్‌పల్లిలోని మేధా స్కూల్‌లో అల్ప్రాజోలం తయారీ కేసులో అరెస్టయ్యాడు. బెయిల్‌పై విడుదలై స్వగ్రామంలో మళ్లీ తయారీ యూనిట్ ఏర్పాటు చేశాడు. జయప్రకాశ్‌పై ఈగల్ ఫోర్స్ పోలీసులు నిఘా పెట్టి నేడు అరెస్ట్ చేశారు.

## రోడ్లపై కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లకు నో ఎంట్రీ

* నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.డీటీఓ శంకర్ నాయక్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని, కేజ్ వీల్స్ అమర్చుకుని ప్రజా రహదారులపై ప్రయాణించే ట్రాక్టర్లను గుర్తిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు రూ.10,000 జరిమానా విధిస్తామని మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీఓ) శంకర్ నాయక్ హెచ్చరించారు. రైతులు నిబంధనలు తప్పనిసరిగా పాటించి ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడంతో పాటు రోడ్డు భద్రతకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

* పొలాల్లో మాత్రమే కేజ్ వీల్స్ వినియోగించాలి

వ్యవసాయ అవసరాల కోసం ఉపయోగించే ట్రాక్టర్లకు అమర్చే ఇనుప కేజ్ వీల్స్‌ను ప్రజా రహదారులపై వినియోగించరాదని డీటీఓ స్పష్టం చేశారు. కేజ్ వీల్స్‌ను పొలాల్లో మాత్రమే ఉపయోగించాలన్నారు. వ్యవసాయ పనులు పూర్తయిన తర్వాత వాటిని తొలగించి సాధారణ రబ్బరు టైర్లను అమర్చుకుని మాత్రమే రహదారులపై ప్రయాణించాలని సూచించారు. రోడ్లకు నష్టం.. ప్రమాదాలకు కారణం వ్యవసాయ భూముల్లో బురద నేలల్లో ట్రాక్టర్‌కు మెరుగైన పట్టును కల్పించేందుకు కేజ్ వీల్స్ ఉపయోగపడతాయి. అయితే వాటితో బీటీ, సీసీ, గ్రామీణ రహదారులపై ప్రయాణించడం వల్ల రోడ్ల ఉపరితలం తీవ్రంగా దెబ్బతింటుందని తెలిపారు. ఇనుప కేజ్ వీల్స్ కారణంగా రోడ్లపై గుంతలు ఏర్పడి, ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రహదారులు త్వరగా ధ్వంసమవడంతో పాటు ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులకు ప్రమాదాలు సంభవించే అవకాశాలు అధికమవుతాయని పేర్కొన్నారు.

## జిల్లాలో మంత్రుల విస్తృత పర్యటన

– విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో రాష్ట్ర మంత్రులు విస్తృతంగా పర్యటించారు. ఇల్లందు మండలం రొంపేడు గ్రామంలో నూతనంగా రూ.3.25 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న 33/11 కె.వి. విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయగా, టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్ రోడ్ వద్ద నూతనంగా నిర్మించిన 33/11 కె.వి. విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేస్తూ విద్యుత్ మౌలిక సదుపాయాలను వేగంగా విస్తరిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి కార్మికులతోపాటు విద్యుత్ రంగ సంస్థల ఉద్యోగుల భద్రత కోసం ప్రమాద బీమా పథకాలు అమలు చేస్తున్నామని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రూ.1.20 కోట్ల ప్రమాద బీమా రక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎన్‌పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ రెడ్డి, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, వైరా శాసనసభ్యులు రామదాస్ నాయక్, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

* పుష్కరాల నాటికి దేవస్థానం పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలి: పొంగులేటి

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదివారం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో కొనసాగుతున్న పునరుద్ధరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ శాఖ అధికారులు ఆలయ పునరుద్ధరణ పనుల రూపకల్పన, పురోగతి, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మ్యాప్‌ల ద్వారా మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ఆలయ పునరుద్ధరణ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.351 కోట్లు మంజూరు చేసిందని, ఆలయ అభివృద్ధి, విస్తరణ కోసం అవసరమైన భూసేకరణకు సుమారు రూ.75 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి పునరుద్ధరణ పనులను వంద శాతం పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పునరుద్ధరణ పనుల కారణంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత తదితర సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంజినీరింగ్ శాఖ, దేవాదాయ శాఖ అధికారులతో ఆలయ పునరుద్ధరణ పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, ఆర్కిటెక్ మూర్తి, జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ రాజు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, భద్రాచలం గ్రామ సర్పంచ్ పూనెం దొర, దేవస్థానం ఈవో దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల రాత పరీక్షలు



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ) యూనిట్ -1, యూనిట్ -2 పరిధిలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి నిర్వహించిన రాత పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా జరిగాయని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఆదివారం జిల్లా కలెక్ట రేట్ లో నిర్వహించిన ఈ పరీక్షలను అదనపు కలెక్టర్ బెన్ షా లోం తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబం ధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకతతో పరీక్షలు నిర్వహించామన్నారు. పరీక్ష ప్రారంభానికి ముందు అభ్యర్థుల కు,ఇన్విజిలేటర్లకు పరీక్ష నిబంధనలు, విధివిధానాల పై కలెక్టర్ సూచనలు చే శారు. రెండు గంటల సమయం కేటా యించిన ఈ పరీక్షలో ప్రశ్నాపత్రాన్ని పూర్తిగా చదివి అర్థం చేసుకుని సమా ధానాలు రాయాలని అభ్యర్థులకు తె లిపారు . ఎస్‌డీసీ యూనిట్ -1, యూ నిట్ -2 లోని డేటా ఎంట్రీ ఆపరేటర్, చైన్ మెన్, స్వీపర్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు మొత్తం 615 మంది దరఖా స్తు చేసుకోగా, 446 మంది పరీక్షకు హా జరయ్యారు. 169 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల నిర్వహణ మొత్తం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పర్యవేక్షణలో జరిగింది. పరీక్షల నిర్వహణలో జిల్లా ఉపాధి కల్పన అధికా రి ఆర్.కుమారస్వామి, జీసీడీఓ గౌసి యాబేగం, విద్యాశాఖ సిబ్బంది పాల్గొని పర్యవేక్షించారు.

# పోలీసు పహారాలో బహదూర్‌గూడ.. కొనసాగుతున్న భూముల స్వాధీన ప్రక్రియ



హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయం సమీపంలోని బహదూర్‌గూడ గ్రామంలో 650 ఎకరాల ప్రభుత్వ భూముల స్వాధీన ప్రక్రియ కొనసాగుతోంది. భూమి చుట్టూ హైడ్రా సిబ్బంది ఫెన్సింగ్ వేస్తున్నారు. అర్ధరాత్రి దీక్షా శిబిరాన్ని తొలగించిన అధికారులు ఆ ప్రాంతంలో కూడా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. బహదూర్‌గూడ గ్రామిన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బయటి వ్యక్తులు గ్రామంలోకి రాకుండా పోలీసులు పహరాకాస్తున్నారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం 650 ఎకరాల భూమి కేటాయింపుపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ విలువకు ప్రకారం పరిహారం లేదా భూమికి బదులుగా భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని 8 రోజులుగా భూముల వద్ద దీక్ష చేస్తున్న రైతులు... నిన్న అక్కడికి వచ్చిన హైడ్రాను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత చోటుచేసుకున్న విషయం తెలిసిందే.

# నిరుద్యోగులను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ రాజకీయాలు



హైదరాబాద్: బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు నిరుద్యోగులను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. బీఆర్ఎస్ నిర్వహించింది యువ సంగ్రామ సదస్సు కాదని.. యువతను రెచ్చగొట్టే సదస్సు అని ఆక్షేపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. ‘‘తెలంగాణ ఉద్యమంలో యువతను రెచ్చగొట్టి అనేక మంది బలిదానాలకు కారణమయ్యారు. శనివారం నిర్వహించిన సదస్సులో యువతను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు. వేదికపై వికృతంగా మాట్లాడుతున్న వాళ్లను కేటీఆర్ వారించకుండా చూస్తూ కూర్చున్నారు. మళ్లీ అధికారంలోకి రావాలన్న ఆలోచనతో విష బీజాలు నాటే ప్రయత్నం చేస్తున్నారు. మా ప్రభుత్వం 70వేల ఉద్యోగాలను భర్తీ చేసింది. పేపర్ లీక్‌లు లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించి నియామకపత్రాలు అందజేశాం. అంగన్‌వాడీ, పోలీస్‌శాఖతో పాటు అనేక ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చాం.. భవిష్యత్తులో మరికొన్ని ఇస్తాం. రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే కేటీఆర్ డ్రామాలు ఆడుతున్నారు. పేపర్లు లీక్ చేసిన చరిత్ర బీఆర్ఎస్‌ది. నిరుద్యోగ భృతి ఇస్తామని ఇవ్వకుండా మోసం చేసిన చరిత్ర కేసీఆర్‌ది’’ అని ఆది శ్రీనివాస్ విమర్శించారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కలకలం.. విమానాలపై లేజర్ దాడులు!

హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ) పరిసరాల్లో విమానాల భద్రతకు సరికొత్త ముప్పు పొంచి ఉంది. విమానాలు టేకాఫ్ అవుతున్నప్పుడు లేదా ల్యాండింగ్ కోసం వస్తున్నప్పుడు వాటిపైకి శక్తివంతమైన లేజర్ కిరణాలను ప్రయోగించే ఘటనలు నగరంలో ఆందోళనకరంగా పెరుగుతున్నాయి. గడిచిన రెండేళ్లలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పరిధిలో ఇలాంటివి 100కు పైగా కేసులు నమోదు కావడం ఏవియేషన్ రంగాన్ని ఉలిక్కిపడేలా చేసింది. దాదాపు రెండు వారాల క్రితం జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నగరం నుండి హైదరాబాద్ వచ్చిన లూఫ్తాన్సా విమానానికి ల్యాండింగ్ సమయంలో ఒక ప్రమాదకరమైన అనుభవం ఎదురైంది. రన్‌వేపైకి వస్తున్న క్రమంలో విమానం కాక్‌పిట్‌పైకి ఒక్కసారిగా లేజర్ కాంతి దూసుకొచ్చింది. అత్యంత కీలకమైన ల్యాండింగ్ సమయంలో లేజర్ వెలుతురు వల్ల పైలట్ల కంటి చూపునకు తాత్కాలికంగా అంతరాయం కలిగింది. పైలట్లు సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, దేశవ్యాప్తంగా 43 విమానాశ్రయాలలో 1,000కు పైగా ఇలాంటి లేజర్ ఘటనలు నమోదు కాగా.. అందులో 10 శాతం కేవలం హైదరాబాద్‌లోనే జరిగాయి. ముంబై, బెంగళూరు వంటి పెద్ద నగరాల కంటే హైదరాబాద్‌లోనే ఈ తరహా కేసులు రెండింతలు ఎక్కువగా ఉన్నాయి.

# “కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

*** పార్టీపై కుట్రలు సహించం”**
**– మేడిపల్లి డివిజన్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి**



మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ ఆదేశాల మేరకు మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్ (మేడిపల్లి)లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి డీసీసీ ప్రధాన కార్యదర్శి జలెందర్ రెడ్డి, పోచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్రె రాజేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేయడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే ప్రతి కార్యకర్తకు అధిష్టానం తగిన గుర్తింపు, గౌరవం కల్పిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ గత పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో కష్టాలు, అవమానాలు, అక్రమ కేసులు ఎదుర్కొన్నప్పటికీ కార్యకర్తలు వెనక్కి తగ్గకుండా పార్టీ విజయానికి కృషి చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జీలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ సెల్ నాయకులు, యూత్ కాంగ్రెస్, సేవాదళ్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్ నాయకులు, కమిటీ సభ్యులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా లయన్ డాక్టర్ చిల్లా రాజశేఖర్ రెడ్డి 56 వ జన్మదిన వేడుకలు



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రగతినగర్ అధ్యక్షులు, పారిశ్రామికవేత్త, రాజ్యలక్ష్మి ఇండస్ట్రీస్ అధినేత లయన్ డాక్టర్ చిల్లా రాజశేఖర్ రెడ్డి 56వ జన్మదిన వేడుకలు ఆదివారం రంగారెడ్డినగర్ డివిజన్ పంచశీల కాలనీలోని రాజ్యలక్ష్మి ఇండస్ట్రీస్ ఆవరణలో పలువురు అధికారులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ ప్రముఖులు, మిత్రులు,లలిత పరమేశ్వరి దేవాలయ సభ్యులు,శాంతి వికలాంగుల సంఘ సభ్యుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు హాజరై ఆయనను శాలువాలతో పుష్పగుచ్చాలతో సన్మానిస్తూ కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా పేద ప్రజల నివాస ప్రాంతాల్లో ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలు,పేద విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ,అనాధలను తోచినంతలో ఆదరించడంతోపాటు, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పలు విధాల వైద్య సేవలు అందించడం ఎంతో గొప్ప వరంగా భావిస్తున్నానన్నారు. సామాజిక సేవకే నా జీవితం అంకితం అని అన్నారు. ఇంతటి పండుగ వాతావరణంలో తన పుట్టినరోజు వేడుకలు జరగడం చెప్పలేనంత సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఎస్పి నాగేశ్వరరావు, ప్రాగా ఏఈ.సిహెచ్. రాములు, ఎస్సై హమీద్, బిజెపి సీనియర్ నాయకులు సుబ్బారావు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు లయన్.డి.ఎల్లా సుబ్బారెడ్డి, వాకాటి మనోహర్, విష్ణువర్ధన్ రెడ్డి, పారిశ్రామికవేత్తలు వాకిటి రామిరెడ్డి,కిషోర్ బాబు, ఎన్.వెంకట్ రెడ్డి, జింకల వెంకటేష్ ముదిరాజ్, సూర్యనారాయణ, కె.రమణారెడ్డి, గోపాల కృష్ణారెడ్డి, జంజున్ వాలా, హేమాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.




# భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

*** గాంధీనగర్ లో మొక్కలు నాటిన రోటరీ క్లబ్ సభ్యులు**







జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్ లో ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సహకారంతో స్వామి వివేకానంద యువజన సంఘము అధ్యక్షులు జల్దా లక్ష్మి నాథ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఠాగూర్ హై స్కూల్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ బాల కోటి రెడ్డి, క్లబ్ అధ్యక్షులు చక్రవర్తి రెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు వెంకట్ రెడ్డి, అభిషేక్, డాక్టర్ సుబ్బారావు,ఠాగూర్స్ స్కూల్ కరెస్పాండంట్ బండారి సాయి కుమార్ లు హాజరై ముందుగా మొక్కలు పెంచడం వల్ల కలిగే లాభాల గురించి విద్యార్థులకు వివరించారు. భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాలంటే ప్రతి ఒక్కరు తమ వంతు మొక్కలు నాటాలన్నారు. మానవ మనుగడకు మొక్కలే జీవనాధారమన్నారు. అనంతరం రెడ్క్రాస్ విద్యార్థులతో గాంధీనగర్లో మార్చ్ ఫాస్ట్ నిర్వహించి ప్రజలకు మొక్కల వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ధనుంజయ, సంధ్య, వాసి లక్ష్మి రెడ్డి,శ్రీనివాస్, బిక్షపతి,రాజి రెడ్డి, నవీన్,నాగరాజ్, సాయి, మణికంత, ఆనంద్, సంపత్ ,రవి తేజ తదితరులు పాల్గొన్నారు.

# లాడ్జిలపై పోలీసుల ఆకస్మిక తనిఖీలు.. యజమానులకు డీసీపీ హెచ్చరిక



జనగామ, ప్రజాస్ఫూర్తి : పట్టణం లోని లాడ్జిల పై పోలీసులు ఆదివారం ఆకస్మి క తనిఖీలు నిర్వహించారు. ఇతర రా ష్ట్రాల నుంచి వచ్చి నేరాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి అరికట్టేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు డీసీపీ రాజ మ హేంద్రనాయక్ తెలిపారు. ఈ సందర్భం గా లాడ్జి యజమానులకు ఆయన ప లు సూచనలు చేశారు. లాడ్జిలో బస చేసే ప్రతి వ్యక్తి పూర్తి వివరాలు, గుర్తింపు కా ర్డు వివరాలను తప్పనిసరిగా నమో దు చేయాలని, అనుమానాస్పద వ్యక్తు లు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమా చా రం ఇవ్వాలని ఆదేశించారు. నిబం ధనలు పాటించని లాడ్జిల పై చట్టపర మైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సీ.ఐ సత్య నా రాయణ రెడ్డి, ఎస్సై చెన్నకేశవులు తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# డీసీపీ కార్యాలయంలో ప్రమాదం.. ప్రహరీ గోడ కూలి వాహనాలు ధ్వంసం



జనగామ, ప్రజాస్ఫూర్తి : పట్టణం లోని డీసీపీ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన పనుల సందర్భంగా ప్రహరీ గోడ కూలిపోవడంతో రెండు కార్లు, ఒక ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది.డీసీపీ కార్యాలయంలో జేసీబీతో జరుగుతున్న పనుల సమయంలో డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రహరీ గోడ ఒక్కసారిగా కుప్పకూలిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.గోడ అవతల పార్క్ చేసి ఉన్న రెండు కార్లు, ఒక బైక్‌పై భారీ గోడ పడటంతో వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు.ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిర్మాణ పనుల సమయంలో తగిన భద్రతా చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చింది.

# జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కలకలం



హైదరాబాద్: రాజేంద్రనగర్ లోని జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కలకలం రేగింది. ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణా రెడ్డి తనను వేధిస్తున్నారంటూ ట్రైనీ మహిళా ఐపీఎస్ అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ‘‘ఉదయ్ కృష్ణారెడ్డి అసభ్యకర మెసేజ్‌లు పంపాడు. నా ఫోన్ లాక్కొని పాస్‌వర్డ్ చెప్పాలని బెదిరించాడు. గదిలో బంధించి జుట్టు పట్టుకుని దాడి చేశాడు. మెడకు కత్తిపెట్టి బెదిరించాడు. శారీరకంగా వేధించి అసభ్యకరంగా ప్రవర్తించాడు. అనుమతి లేకుండా ప్రైవేట్ వీడియోలు తీశాడు. ఆ వీడియోలను నా భర్తకు పంపిస్తానని బ్లాక్‌మెయిల్ చేశాడు’’ అని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగాలు ఇవ్వకుండా ఎవరు అడ్డుకున్నారు?: శ్రీధర్‌బాబు



కరీంనగర్: ప్రతి జిల్లాలో ఎల్‌నినో సంబంధిత కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలపై ప్రణాళికను రూపొందించి అమలు చేస్తామని చెప్పారు. కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లో సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వ్యవసాయం, తాగునీరు, వైద్యం, విద్యుత్, విపత్తు నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు మంత్రులు దిశానిర్దేశం చేశారు. సమీక్ష అనంతరం శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. ‘‘సాగునీటి విషయంలో మాకు ఎలాంటి భేషజాలు లేవు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) చెప్తే తప్పకుండా మేడిగడ్డ, కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోస్తాం. ఒక్కరోజు లక్ష క్యూసెక్కులు రాగానే విపక్ష నేతలు గోల చేశారు. ప్రస్తుతం గోదావరిలో 16వేల క్యూసెక్కుల వరద కూడా లేదు. యువతను కేటీఆర్ పక్కదోవ పట్టించే యత్నం చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించలేదు. పదేళ్లు ఉద్యోగాలు ఇవ్వకుండా ఎవరైనా అడ్డుకున్నారా? రెండున్నరేళ్లలో 70వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పాం.. జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం’’అని శ్రీధర్‌బాబు అన్నారు.

హెల్త్

# వేడి నీళ్లతో ఎన్నో లాభాలు



ప్రతిరోజూ వేడి నీళ్లు తాగితే ఆరోగ్యానికి చాలామంచిది అంటున్నారు ఎక్స్‌పర్ట్స్. ఇప్పటికే చాలామందికి ఈ అలవాటు ఉండే ఉంటుంది. ఒకవేళ అలవాటు లేకపోతే ఇప్పటి నుంచి అలవర్చుకోండి. ఎందుకంటే ఇలా రోజూ పరగడుపున వేడినీళ్లు తాగడం వల్ల బోలెడన్ని లాభాలున్నాయి.

**జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది**
వేడి నీరు ఆహార కణాల విచ్ఛిన్నం చేసి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కడుపు కండరాలకు విశ్రాంతి, ఉపశమనాన్ని కలిగిస్తుంది. ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది.

**గొంతు నొప్పిని తగ్గిస్తుంది**
వేడి నీళ్లలో తేనె, నిమ్మకాయ కలిపి తాగితే గొంతులో మంట, చికాకును తగ్గిస్తుంది. తద్వారా గొంతు నొప్పిని తగ్గిస్తుంది. గొంతును తేమగా ఉంచుతుంది.

**రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది**
వేడి నీరు రక్త నాళాలను విస్తరించడంలో సాయపడుతుంది. శరీరం అంతటా రక్త ప్రసరణను మెరుగుపరిచేలా చేస్తుంది. కణాలకు మెరుగైన ఆక్సిజన్, పోషకాలని అందిస్తుంది.

**బరువు తగ్గొచ్చు**
బరువు తగ్గించడంలో వేడి నీరు సాయపడుతుంది. శరీరంలో కొవ్వు నిల్వలను విచ్ఛిన్నం చేయడంలో సాయపడుతుంది.

**కండరాల నొప్పికి ఉపశమనం**
వేడి నీరు తాగితే.. కండరాలు రిలీఫ్ అవుతాయి. ఆర్థరైటిస్, కండరాల ఒత్తిడితో సంబంధం ఉన్న నొప్పిని తగ్గించడంలో సాయపడుతుంది. వాపును తగ్గిస్తుంది.అయితే... వేడి నీరు తాగేంత ఉష్ణోగ్రతలో ఉండాలి. విపరీతమైన వేడి నీరు తాగకూడదు. అలా ఉంటే నోరు, అన్నవాహికలలోని సున్నితమైన కణజాలాలకు నష్టాన్ని కలిగిస్తుంది.

## సరికొత్త ప్రయోగం..

# మీటీ రైస్!






మనం తినే అన్నంలో కార్బోహైడ్రేట్లు ఎక్కువ, ప్రోటీన్లు తక్కువ. దీంతో డయాబెటీస్ లాంటి సమస్యలు ఉన్నవారు అన్నం తినడం మానేస్తున్నారు. ఒక్క పూట అన్నం తిని మిగతా రెండు పూటలా చపాతీలు, రొట్టెలు లాంటివి తీసుకుంటున్నారు. అయితే చాలా మందికి అన్నం తినకపోతే.. కడుపు నిండినట్టుగా ఉండదు. ఇలాంటి వారి కోసమే దక్షిణ కొరియా సైంటిస్టులు కొత్త రకం బియాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ప్రోటీన్లను ఎక్కువగా అందించేలా 'మీటీ రైస్'ను కొరియన్ శాస్త్రవేత్తలు రూపొందిస్తున్నారు. గులాబీ రంగులో ఉండే ఈ మీటీ రైస్.. పేరుకు తగ్గట్టుగానే ఈ బియ్యంలోకి జంతువుల మాంసాన్ని జొప్పిస్తారు. అయితే ఇందుకోసం నిజమైన జంతువుల మాంసం కాకుండా.. ల్యాబ్‌ల్లో తయారు చేసిన బీఫ్ మాంసం, కొవ్వు కణజాలాలను వాడతారు.

**ఎందుకు తయారుచేశారంటే...**
ఈ కల్చర్డ్ మీట్ ద్వారా శరీరానికి అవసరమైన ప్రోటీన్లను పొందొచ్చని సియోల్‌లోని యోన్సెయ్ యూనివర్సిటీకి చెందిన హాంగ్ అనే పరిశోధకుడు తెలిపారు. ఆసియా దేశాల్లో ఎక్కువ మంది ఆహారంగా వరి అన్నం తింటారు. కాబట్టి ఆర్గనాయిడ్స్, బయోమెడికల్ సైన్సెస్‌లో నిపుణుడైన హాంగ్.. తన పరిశోధన కోసం బియ్యాన్ని ఎంచుకున్నారు.ఈ మీటీ రైస్ తయారీ ప్రక్రియకు సాధారణ బియ్యాన్నే తీసుకొని.. దానికి చేపల నుంచి సేకరించిన గెలటిన్ (ప్రోటీన్) కోటింగ్ వేస్తారు. ఆ తర్వాత ఒక్కో గింజలోకి ల్యాబ్‌ల్లో తయారు చేసిన బీఫ్ కణాలను ఇంజెక్ట్ చేస్తారు. ఇలా బియ్యపు గింజల్లోకి మాంసపు కణాలను ఎక్కించిన తర్వాత అవి ఆ గింజల లోపల అంతటా సమంగా పెరుగుతాయి. సాధారణ బియ్యంతో పోలిస్తే ఈ పింక్ రైస్‌లో 8 శాతం ప్రోటీన్, ఏడు శాతం ఫ్యాట్ అదనంగా ఉంటాయి. ఈ బియ్యాన్ని ఎమర్జెన్సీ రిలీఫ్ ఫుడ్ కింద రెండు ఆఫ్రికా దేశాలకు అందించేందుకు అనుమతులు లభిస్తాయని కొరియా శాస్త్రవేత్తల బృందం ఆశిస్తోంది.

**పేద ప్రజల కోసం..**
కొన్ని దేశాల్లో ప్రజలు పేదరికం రోజుకు ఒక పూట మాత్రమే భోజనం చేయగలుగుతున్నారు. అలాంటి వారిలో ప్రొటీన్ కొంత శాతం పెరిగినా.. అది చాలా మంచిదేనని హాంగ్ చెప్పారు. అయితే దక్షిణ కొరియా ప్రభుత్వం మాత్రం ఇంకా ఈ మీటీ రైస్ వాడకానికి ఆమోదం తెలుపలేదు. కానీ ఇలా కణ మార్పిడి చేసిన (మాంసం) ఆహారంపై పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని.. ఫుడ్‌టెక్ ఫండ్‌లో భారీగా పెట్టుబడులు పెట్టబోతున్నట్టు 2022లో కొరియా ప్రకటించింది.

**ఇటలీ బ్యాన్ చేసింది**
ఇప్పటికే సింగపూర్, అమెరికా మార్కెట్లలో కల్టివేటెడ్ మీట్ అందుబాటులో ఉంది. దీని ప్రభావం మాంసాన్ని ఉత్పత్తి చేసే జంతువులను పెంచే వారిపై ఉండే అవకాశం ఉంటుంది అనే భావనతో కల్టివేటెడ్ మీట్‌ను ఇటలీ గత ఏడాది నిషేధించింది.
కార్బన్ డయాక్సైడ్ తగ్గుతుంది!
ఈ హైబ్రిడ్ రైస్ పట్ల రకరకాల అనుమానాలు వ్యక్తం అవుతున్నప్పటికీ.. దీని వల్ల కార్బన్ డయాక్సైడ్ ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందని, జంతువులను వధించాల్సిన అవసరం ఉండదని హాంగ్ బృందం చెప్తోంది. సంప్రదాయ పద్ధతిలో మాంసాన్ని ఉత్పత్తి చేసే దానికంటే.. ఈ విధానం వల్ల కార్బన్ డయాక్సైడ్ ఉత్పత్తి 8 రెట్లు తగ్గుతుందని హాంగ్ తెలిపారు.

**2040 నాటికి...**
2040 నాటికి ప్రపంచవ్యాప్తంగా వినియోగించే మాంసంలో 40 శాతం మాత్రమే సంప్రదాయ విధానంలో ఉత్పత్తి అవుతుందని.. మిగతా 60 శాతం కల్చర్డ్ మీట్ ఉంటుందని ఏటీ కియర్నీ అనే గ్లోబల్ కన్సల్టెన్సీ అంచనా వేసింది. ఈ టెక్నాలజీతో పాలు, గుడ్డు తెల్లసొన, చేప మాంసాన్ని కూడా ఇలాంటి టెక్నాలజీతో రూపొందించొచ్చని 2019లోనే ఏటీ కియర్నీ తన నివేదికలో పేర్కొంది.
'మరి కొన్నేళ్లు పోతే.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మన కిచెన్లలోకి కూడా వచ్చేస్తుంది. రక్త నమూనాను విశ్లేషించడం ద్వారా సదరు వ్యక్తికి బాగా నప్పే ఆహారాన్ని తయారు చేయాలని రోబోకు ఏఐ సూచనలు చేస్తుంది. ఇలా మన శరీర అవసరాలకు సరిపడే ఆహారాన్ని రోబో వండి మన ముందు ఉంచుతుంది' అని హాంగ్ చెబుతున్నారు.



# యువతలో డయాబెటిస్!

మారుతున్న జీవనశైలి కారణంగా నేటి యువత అనారోగ్యం పాలవుతున్నారు. ముఖ్యంగా యువకుల్లో డయాబెటిస్ కేసులు రావడం ఆందోళన కలిగిస్తోంది. అసలు యువతలో డయాబెటిస్ రావడానికి కారణాలేంటి? పరిష్కార మార్గాలేంటో తెలుసుకుందాం.



**జీవనశైలి :**
శారీరక శ్రమ లేకపోవడం, స్క్రీన్ ఎక్కువ సమయం చూడడం వల్ల రావొచ్చు. కాబట్టి .. ఆరోగ్యకరమైన, చురుకైన జీవనశైలిని కలిగి ఉండాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఒకేచోట కదలకుండా ఉండకూడదు. రోజు వాకింగ్ చేయాలి.

**జంక్ ఫుడ్ :**
అధిక క్యాలరీలు, ప్రాసెస్ చేసిన ఆహారాలు తీసుకోవడం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువ. అందుకే ఆహారపు అలవాట్లు, ఆహార ఎంపికల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. తృణధాన్యాలు, లీన్ ప్రోటీన్లు, పండ్లు, కూరగాయలతో కూడిన పోషకమైన ఆహారాన్ని తీసుకోవాలి. అదే సమయంలో ప్రాసెస్ చేసిన ఆహారాలను పూర్తిగా తగ్గించాలి.

**ఊబకాయం :**
అధిక శరీర బరువు మధుమేహానికి దారితీస్తుంది. కాబట్టి బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) ఎంత స్థాయిలో ఉందో తెలుసుకోవాలి. సమతుల్య ఆహారంతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. హెల్దీ వెయిట్ ఉండేలా చూసుకోవాలి.

**జెనెటిక్స్ :**
మధుమేహం అనేది కుటుంబంలో ఎవరికైనా ఉంటే అది వారసత్వంగా వస్తోంది. దీన్ని ముందుగానే గుర్తించాలి. జన్యుపరమైన కారకాలను మార్చలేనప్పటికీ, ఆరోగ్యకరమైన జీవనశైలి ఇప్పటికీ మధుమేహం ప్రమాదాన్ని తగ్గించడంలో సాయపడుతుంది.

**తగినంత నిద్ర:**
తగినంత నిద్ర లేకపోవడం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అందుకే నిద్రకు అధిక ప్రాధాన్యత ఇవ్వండి.

**ఒత్తిడి :**
ఈ రోజుల్లో ఒత్తిడి చాలా ఎక్కువైపోతోంది. అయితే, దీర్ఘకాలిక ఒత్తిడి యువతలో మధుమేహం వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి సమతుల్య జీవనశైలిని కలిగి ఉండటంతో పాటు ఒత్తిడిని కంట్రోల్ చేసుకోవాలి.

**అధిక రక్తపోటు :**
హైపర్ టెన్షన్ అని పిలిచే అధిక రక్తపోటు వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువ. కాబట్టి ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం, రక్తపోటును కంట్రోల్ చేసుకోవడం వల్ల డయాబెటిస్ రాకుండా ఉంటుంది.





MOVIE TIME



## వీరాధివీరులంటలో
# లక్కీ ఛాన్స్

రాజాసాబ్ హీరోయిన్ మాళవికా మోహనన్ టాలీవుడ్‌లో ఓ బంపరాఫర్ అందుకున్నట్లు సమాచారం. రవితేజ, శ్రీవిష్ణు హీరోలుగా రాబోతున్న ఓ మల్టీస్టారర్ మూవీలో ఓ హీరోయిన్‌గా మాళవికా ఫిక్సైనట్లు తెలిసింది. రవితేజతో ఈ మలయాళ బ్యూటీ జత కట్టనున్నట్లు చెబుతున్నారు. యాక్షన్ కామెడీగా తెరకెక్కుతోన్న ఈ సినిమాకు వీరాధివీరులంట అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. ఆగస్ట్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కాబోతుంది. వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మూవీకి హసిత్ గోలి దర్శకత్వం వహిస్తుండగా దిల్‌రాజు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం కార్తి సర్దార్ 2లో హీరోయిన్‌గా నటిస్తోంది ఈ అందగత్తే. అప్పుడు రవితేజ ఖిలాడీ మూవీని రిజెక్ట్ చేసి ఇప్పుడు అతడితోనే రొమాన్స్ చేయబోతుండటం ఆసక్తికరంగా మారింది.





# లెట్స్ బ్రేకప్!

హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ లవ్‌స్టోరీకి బ్రేకప్ పడిందా.. అంటే ఔననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. చియాన్ విక్రమ్ తనయుడు ధృవ్ విక్రమ్‌తో అనుపమ ప్రేమలో ఉన్నట్లుగా చాలా కాలంగా తమిళనాట టాక్ విని పిస్తోంది. ధృవ్ హీరోగా నటించిన బైసన్ మూవీ టైమ్‌లోనే వీరు ప్రేమలో పడినట్లు టాక్. ముంబైలో అటెండైన ఓ ఈవెంట్ ఫొటోను ధృవ్ సోషల్ మీడియాలో షేర్ చేయగా.. హార్ట్ ఎమోజీతో అనుపమ రిప్లై ఇచ్చింది. అయితే మన స్పర్థల కారణంగా వీరిద్దరు విడిపోయారట. ఇన్‌స్టాలోనూ ధృవ్‌ను అన్‌ఫాలో చేసింది ఈ అమ్మడు. నేను మళ్లీ నా జీవితాన్ని ప్రేమించడం మొదలుపెట్టా. నా మనశ్శాంతి కోసం కొన్ని గమ్యం లేని దారులను వదిలిపెట్టాల్సి వచ్చింది. ఎవరి నియంత్రణలు, భయాలు నన్ను ఆపలేవు అంటూ అనుపమ పెట్టిన ఓ పోస్ట్ తెగ వైరలవుతోంది. బ్రేకప్ గురించి ఇన్‌డైరెక్ట్‌గా హింట్ ఇచ్చిందని నెటిజన్లు అంటున్నారు.

# సెప్టెంబర్‌లో ఆర్‌సీ 17!

పెద్ది తర్వాత రామ్‌చరణ్ స్టార్ డైరెక్టర్ సుకుమార్‌తో ఓ సినిమా చేయబోతున్నాడు. ఈ 17వ సినిమాకు ఆర్‌సీ 17 అనే వర్కింగ్ టైటిల్‌ను అనుకుంటున్నారు. రంగస్థలం తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న ఈ మూవీపై అనౌన్స్‌మెంట్ నుంచే అంచనాలు ఆకాశాన్నంటాయి. కథ, పాత్రల పరంగా ప్రయోగాలు చేయబోతున్నారని, వారి కెరీర్‌లోనే డిఫరెంట్ జానర్‌లో ఈ సినిమా ఉండబోతున్నట్లు వార్తలొస్తున్నాయి. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో రెండు పార్ట్‌లతో తెరకెక్కనుందని అంటున్నారు. అయితే ఈ రూమర్లలో నిజం లేదట. ప్రయోగాలను పక్కనపెట్టి స్టైలిష్ కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారు. సెప్టెంబర్‌లో ఆర్‌సీ 17 లాంఛ్ అయ్యి నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది.



# క్యా హుఆ భాయ్?

కండల వీరుడు, బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ షాకింగ్ లుక్‌లో దర్శనమిచ్చారు. ముంబైలో జరిగిన ఓ ఈవెంట్‌లో గుర్తుపట్టలేనంతగా మారిపోయి కనిపించడంతో అభిమానుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. క్యాప్ ధరించి క్యాజువల్ షర్ట్, జీన్స్ ధరించి కనిపించారు. మీడియా ముందుకొచ్చిన ప్రతిసారి హుషారుగా కనిపించే సల్మాన్ ఈ వేడుకలో డల్‌గా ఉన్నారు. దీంతో చాలా మంది ఫ్యాన్స్ గుర్తుపట్టలేకపోయారు. ఈ స్టార్ హీరోకు ఏమైంది? ఆరోగ్యం బాగాలేదా అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతోన్నారు. మరికొందరు 60 ఏళ్ల వయసులో యంగ్ లుక్‌లో కనిపించడం ఎలా సాధ్యమని అంటున్నారు. సినిమా కోసం కొత్త మేకోవర్ కావచ్చునని ట్వీట్స్, పోస్టులు చేస్తున్నారు. కాగా ఈవెంట్‌లో సల్మాన్ పాల్గొన్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరలవుతోన్నాయి. ప్రస్తుతం టాలీవుడ్ డైరెక్టర్ వంశీ పైడిపల్లితో ఓ సినిమా చేస్తున్నాడు సల్మాన్ భాయ్.



## శ్రీమతితో
# రీ ఎంట్రీ..

రెండేళ్ల గ్యాప్ తర్వాత నివేదా థామస్ టాలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇవ్వబోతుంది. శ్రీమతి పేరుతో ఓ లేడీ ఓరియెంటెడ్ సినిమా చేస్తోంది. థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీలో రిలీజ్ కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. తమ అప్‌కమింగ్ మూవీస్, వెబ్‌సిరీస్ వివరాలను జీ5 ఓటీటీ రివీల్ చేసింది. ఈ లిస్ట్‌లో శ్రీమతి మూవీ ఒకటని ప్రకటించింది. ఈ సినిమా తాలూకు చిన్న వీడియో గ్లింప్స్‌ను అభిమానులతో పంచుకుంది. శ్రీమతి మూవీతో కొత్త డైరెక్టర్ టాలీవుడ్‌కు పరిచయం కానున్నట్లు చెబుతున్నారు. కుటుంబ బాధ్యతల కారణంగా ఓ గృహిణి తన కలలకు ఎలా దూరమైంది? డ్యాన్సర్ కావాలనే తన లక్ష్యాన్ని ఏ విధంగా నెరవేర్చుకుందనే అంశాలతో ఈ మూవీ రూపొందుతోన్నట్లు సమాచారం.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.